TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 సంచిక : 75 మంగళవారం 11-11-2025 ఎడిటర్ : ముఖేష్ వీరంటి పేజీలు: 5 వెల : 5 రూ/.

## 488 రోజుల తర్వాత అప్పీల్ చేస్తారా?

**మణికొండ జాగీర్ భూసేకరణ తీర్పుపైప్రభుత్వ అప్పీలును కొట్టేసిన న్యాయస్థానం**

**హైదరాబాద్, నవంబరు 10:** భూసేకరణకు సంబంధించిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 488 రోజుల తర్వాత వేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇంత ఆలస్యంగా దాఖలు చేసిన అప్పీలును సమర్థించలేమని ద్విసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మణికొండ జాగీర్‌లో సిలికాన్ హైట్స్ నిర్మాణం కోసం 2001లో సేకరించిన 6.22 ఎకరాల భూమికి సంబంధించి కలెక్టర్ దాఖలు చేసిన అప్పీల్‌ను తిరస్కరించింది. ఎన్నికల విధులు, ఇతర పనులను కారణంగా చూపే హక్కు కలెక్టర్‌కు లేదని స్పష్టం చేసింది. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఎన్నో వెసులుబాట్లు ఉన్నా జాప్యం చేయడాన్ని స్వాగతించలేమని పేర్కొంది. మణికొండ జాగీర్‌లోని 6.22 ఎకరాల తమ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ మల్లేశ్వరి సహా 31 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## మా విద్యార్థులు ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్‌కు గర్వకారణం!




తొవ్వ,ఖమ్మం ,నవంబర్ 10: అనితర సాధ్యమైన విలువిద్య (ఆర్చరీ) లో ఉత్తమ ప్రతిభ కనబరచి పసిడి , రజత పతాకాలు సాధించి ఖమ్మం కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేస్తూన్నారని ఆర్చరీ స్టేట్ సెక్రటరీ పుట్ట శంకర్ అన్నారు సోమవారం హైదరాబాద్‌లోని కొల్లాపూర్‌లోని ఏకలవ్య ఆర్చరీ హబ్‌లో జరిగిన సబ్-జూనియర్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ ఆటగాళ్లకు హృదయపూర్వక అభినందనలు.తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైనా విలువిద్య కారులు ఇండియన్ రౌండ్ కె. రామ్ చరణ్ ు బంగారు పతకం రికర్వ్ రౌండ్ కె. లోహిత శ్రీ ు రజత పతాకం సాధించారు మా యువ ఛాంపియన్‌లు నేషనల్స్‌లో గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నమని ఆర్చరీ సంఘ సభ్యులు అన్నారు.

# ఢిల్లీలో భారీ పేలుడు...

## ఎర్రకోట సమీపంలో పేలిన కారు

4 లో..



**న్యూఢిల్లీ, నవంబరు 10:** దేశ రాజధాని ఢిల్లీ.. భారీ పేలుడుతో దద్దరిల్లింది! దేశంలోని అత్యంత హై ప్రొఫైల్ ప్రాంతాల్లో ఒకటి.. పంద్రాగస్టునాడు దేశ ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించే ఎర్రకోటకు సమీపంలో మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో కారు పేలి 9 మంది మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు! క్షతగాత్రులను హుటాహుటిన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని.. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఢిల్లీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్న రోజునే.. అదీ హరియాణా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కారులో పేలుడు జరగడంతో.. దీని వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు, ఇతర కేంద్ర సంస్థల సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పేలుడు ?తీవ్రతకు ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు కనిపించాయి. మృతదేహాలు ఛిద్రమై శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపైన, పక్కనే ఉన్న వాహనాలపైనా పడ్డాయి. పేలుడు ధాటికి.. చుట్టూ ఉన్న వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు కార్లు, రెండు ఈ-రిక్షాలు, ఒక ఆటో అగ్నికి ఆహుతైపోయాయి. మొత్తం 22 కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలికి సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. భవనాలు కంపించాయి. ఈ పేలుడు జరిగిన మూడు నిమిషాలకే అగ్నిమాపక శాఖకు ఫోన్ కాల్ వెళ్లింది. వెంటనే ఏడు యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది 20 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు రంగంలోకి దిగి.. 7.29 గంటలకల్లా.. అంటే పేలుడు జరిగిన 40 నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పేలుడుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చా వెల్లడించారు. "సాయంత్రం 6.52 గంటలకు.. రెడ్‌ఫోర్ట్ మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో నిదానంగా వచ్చిన ఒక కారు అక్కడ ఆగీ ఆగగానే పేలిపోయింది.

- 9 మంది మృతి 24 మందికి గాయాలు
- ముగ్గురు విషమం.. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం
- ఛిద్రమైన శరీరభాగాలతో ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు
- పేలుడు ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న పలు వాహనాలు, దుకాణాలు
- పేలుడు సమయంలో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా
- ఘటనాస్థలికి హోం మంత్రి షా
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- ఉగ్రకుట్ర కోణంలోనూ ఎన్ఐఏ దర్యాప్తు
- కారు కదలికలపై వివరాల కోసం సీసీటీవీ కెమెరాల జల్లెడ

## లక్ష కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ ఓకే

- విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అసైన్డ్ భూములు
- చట్టంలో కీలక సవరణలతో ఆర్డినెన్స్ జారీకి ఆమోదం
- విశాఖలో పలు ఐటీ సంస్థలకు భూ కేటాయింపులకు అంగీకారం
- కుప్పం, ఓర్వకల్లు, నాయుడుపేటల్లో పలు పరిశ్రమలకు కూడా..
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి, నవంబరు 10:** రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. 70 అంశాలకు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరాలు వెల్లడించారు. అభివృద్ధి , యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా దాదాపు లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలసీల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక నూతన విధానాలను రూపొందించిన ఫలితంగా ప్రపంచంలోని అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని తెలిపారు.


మిగతా 3లో...

# బతుకు బండే పాటగా అందె!

## సోమవారం ఉదయం ఇంట్లోనే కుప్పకూలిన సహజ కవి

- హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి
- ప్రభుత్వ లాంఛనాలతో నేడు ఘట్‌కేసర్‌లో అంత్యక్రియలు
- లాలాపేట ఇంటి నుంచి ఔటర్ జంక్షన్ వరకూ అంతిమ యాత్ర
- అంత్యక్రియలకు హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


4 లో..



**హైదరాబాద్, నవంబరు 10:** సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి ఆయన సొంతూరు. అక్కడే ఆయన చిన్నతనమంతా గడిచింది. దళిత కుటుంబంలో పుట్టారు. అండె బొడ్డయ్య, ఎల్లవ్వ దంపతులకు ముగ్గురు సంతానంలో అందెశ్రీనే పెద్దవారు. పాలబుగ్గల వయసులో తల్లిదండ్రుల నుంచి ఆదరణ కరువైంది. బడిఈడు వచ్చినా కన్నవారు వెన్నుతట్టలేదు. ఎన్నడూ బడికి పోయిందే లేదు. బాలుడిగా ఉన్న అందెశ్రీని ఆ ఊర్లోనే జక్కిరెడ్డి రాధమ్మ చేరదీసింది. కొన్నాళ్లకు ఆమె కుమారుడు జక్కిరెడ్డి మల్లారెడ్డి జీతానికి కుదిరి బర్లు మేపాడు. గ్రామంలోని మునీరు సేటు, డాకూరి బాల్‌రెడ్డి వద్దా బర్లు మేపారు. బాల్యంలో పదేళ్లు పశువుల కాపరిగానే పనిచేశారు అందెశ్రీ. తర్వాత భవన నిర్మాణ రంగంలో కూలీ పనుల కోసం నిజామాబాద్ వెళ్లారు. అక్కడ ఆయన్ను శృంగేరీ శంకర మహారాజ్ అక్కున చేర్చుకున్నారు. అప్పటిదాకా అందె ఎల్లయ్యగా ఉన్న ఆయన పేరును అందెశ్రీగా మార్చింది ఆ మహారాజే. అడ్డుతగిలిన వారిని ధిక్కరించి అందెశ్రీకి ఉపనయనం నిర్వహించి.. గాయత్రి మంత్రాన్ని ఉపదేశించారు. 'ఎంగిలి పాటలు ఎన్నాళ్లు పాడతావు? బతుకు పాటలు రాయి' అంటూ వెన్నుతట్టారు. ఆయన ప్రోత్సాహంతోనే ఛందస్సు నేర్చుకున్నారు.

## జూబ్లీహిల్స్ మనదే!

- అయినా ఈ ఒక్కరోజు అప్రమత్తంగా ఉందాం
- ఓటింగ్ శాతం పెరిగేలా చూడండి
- పోలింగ్ అయ్యేదాకా అందుబాటులో ఉండండి
- మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో సీఎం



**హైదరాబాద్, నవంబరు 10:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ బీఆర్ఎస్ బలహీనపడిందని సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర మంత్రులతో అన్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని చెప్పారు. అయినా పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఆయా మంత్రులు తాము ఇన్‌చార్జులుగా ఉన్న డివిజన్ల నాయకులకు మంగళవారం మొత్తం అందుబాటులో ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించాలని నిర్దేశించారు. సోమవారం ఉదయం అందుబాటులో ఉన్న మంత్రులతో తన నివాసంలో ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఉప ఎన్నికలో పార్టీ పరిస్థితిపై డివిజన్ల వారీగా సమీక్షించారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి సూచించారు. ఉదయమే కాంగ్రెస్ కార్యకర్తలు, సానుభూతి పరులతో ఓట్లు వేయించడం పూర్తి చేయాలని, ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకూ బాధ్యులు తీసుకువచ్చేలా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ శాతం పెరిగితే కాంగ్రెస్ పార్టీ మెజారిటీ పెరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# బిహార్లో నేడే తుది పోరు

## - 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ - ఈ నెల 14న ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి



**పట్నా, నవంబరు 10:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకానికి చేరాయి. రెండోది, చివరి విడత ఎన్నికల్లో 122 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది. వివిధ ప్రధాన పార్టీల నేతలు సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.75 కోట్ల మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని ఈవీఎంలతో నిక్షిప్తం చేయనున్నారు. వీరిలో 1.75 కోట్ల మంది మహిళలే. 18-19 ఏళ్ల వయసుగల నవయువ ఓటర్లు 7.69 లక్షల మంది. సజావుగా పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లూ చేసింది. 45,399 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేసింది. వీటిలో 40,073 కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి. 8,491 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో ఒక్క గయాజీలోనే 1,084 కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు మొత్తం 122 స్థానాల్లోనూ భారీగా భద్రతాబలగాలను మోహరించారు. ఇప్పటికే 500 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ముందస్తు ఎన్నికల విధుల్లో ఉండగా.. వీటితోపాటు మరో 500 కంపెనీల సాయుధ సిబ్బందికి పోలింగ్ బాధ్యతలు అప్పటించారు. వీరుగాక 60 వేల మంది బిహార్ పోలీసులు, 30 వేల బిహార్ సాయుధ పోలీసు సిబ్బంది, 20 వేల మంది హోంగార్డులు, శిక్షణలో ఉన్న మరో 19 వేల మంది కొత్త పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 2 వేల మంది సిబ్బందిని మోహరించారు.

నవాదా జిల్లా హిసువా స్థానంలో అత్యధికంగా 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చంపటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బణ్‌మన్‌ఖీ సీట్లలో 22 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకు గాను 121 స్థానాలకు ఈ నెల 6న జరిగిన మొదటి దశ ఎన్నికల్లో 65 శాతానికిపైగా పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. రెండు దశల్లో కలిపి ఈ నెల 14న ఓట్లు లెక్కించి తుది ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికలు జరిగే జిల్లాల్లో అత్యధికం పూర్వాంచల్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇది ముస్లిం ప్రాబల్య ప్రాంతం కావడంతో బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని పాలక ఎన్‌డీఏ, విపక్ష ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగట్‌బంధన్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి.

## కాంగ్రెస్ నేతలు లక్ష చీరలు పంచుతున్నారు!

**సీఈఓకు మాజీ మంత్రి హరీశ్ రావు ఫిర్యాదు..**



హైదరాబాద్, నవంబరు 10 'జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు.. లక్ష పట్టు చీరలు పంచుతున్నారు. కుక్కర్లు, మిక్సీ గ్రైండర్లను తాయిలాలుగా ఇస్తూ.. అధికార కాంగ్రెస్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తోంది. విచ్చలవిడిగా డబ్బులను పంచుతూనే.. మద్యాన్ని ఏరులై పారిస్తూ.. కాంగ్రెస్ అక్రమ మార్గంలో గెలవాలని చూస్తోంది. ఆ పార్టీ ఎన్నికల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోండి..' అని సీఈఓ సుదర్శన్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్ రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈఓను ఆయన కలిసి వినతి ప్రతంతో పాటు సాక్ష్యాలుగా పలు ఫొటోలు, వీడియో క్లిప్పింగులను సమర్పించారు. ఆనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని.. పోలీసులు, అధికారులు తొత్తులుగా మారి వారి అక్రమాలకు మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. సీ విజిల్ యాప్‌లో, పోలీసు అధికా రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

# తెలంగాణ భావజాలానికి శబ్దాన్నిచ్చిన మహాకవి కన్నుమూత

**- అందెశ్రీ మౌనంతో తెలంగాణ సాహిత్యానికి తిరుగులేని లోటు**

**- తెలంగాణ ఆత్మగీతం మౌనం చెందింది!**

**- ఒక గీతం ఒక ఉద్యమం ఒక యుగం ముగిసింది**

(ప్రత్యేక కథనం )

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా, తెలంగాణ సాహిత్యానికి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) ఆకస్మిక మరణం తెలుగు భాషా ప్రపంచాన్ని శోకసంద్రంలో ముంచింది. ఇంట్లో అకస్మాత్తుగా కుప్పకూలిన ఆయన, వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 7:25 గంటలకు ప్రాణాలు విడిచారు. ఉద్యమగీతాల కర్త నిశ్శబ్దంలో కలిసిపోయిన వార్త తెలంగాణ ప్రజలకు తట్టుకోలేని దెబ్బగా మారింది.

**- తెలంగాణ స్వప్నాన్ని పదబంధాలుగా మలిచిన వాగ్గేయకారుడు**

1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామంలో జన్మించిన అందె ఎల్లయ్య, తరువాత 'అందెశ్రీ'గా సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా చెక్కబడ్డారు. ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ" గీతం, కేవలం పాట కాదుఒక ఉద్యమానికి ఊపిరి, ఒక జాతికి ఐక్యస్వరపటం. ఆ గీతం తప్పకుండా పాడకుండానే ఉద్యమ సభలు ప్రారంభం కావని చెప్పుకోవడం అతిశయోక్తి కాదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భావోద్వేగాలకు అక్షరరూపం ఇచ్చి, ప్రజల్లో నిప్పులు రాజేసిన అరుదైన కవుల జాబితాలో అందెశ్రీ అగ్రగణ్యుడిగా నిలిచారు.

**- పురస్కారాలు ప్రతిభకు వచ్చిన గుర్తింపులు మాత్రమే**

అందెశ్రీపై ప్రభుత్వం ఇటీవల కోటి రూపాయల పురస్కారం ప్రకటించడం, సాహిత్య రంగం కోసం ఆయన చేసిన సేవలకు ఒక ప్రభుత్వ గౌరవం. కాకతీయ యూనివర్సిటీ నుంచి పొందిన గౌరవ డాక్టరేట్, 2006లో గంగ సినిమాకు అందుకున్న నంది అవార్డు, 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారాలుఏ అవార్డును చూసినా, అవన్నీ ఆయన సాహిత్య ప్రస్థానాన్ని మాత్రమే గాక, తెలంగాణ మానసికతను సమగ్రంగా ప్రతిబింబించిన జీవన గాధను కూడా వ్యక్తపరుస్తాయి.

**- అశువు కవిత్వానికి చిరునామా, ప్రజల మనస్సు చదివిన కవి**

అశువు కవిత్వంలోని పటిమ, సభలలో సుడిగాలిలా కవితలు పొంగిపడే వీరత్వం, రాజకీయ వ్యంగ్యంతో కూడిన ప్రజల హృదయాలను తాకే కవితా శైలిఅందెశ్రీని ప్రత్యేకంగా నిలబెట్టిన లక్షణాలు. కేవలం ఉద్యమ కవి మాత్రమే కాదుబీ సామాజిక విలువలు, తెలుగు సంస్కృతి, ప్రజా భావజాలం, రాజకీయ సంస్కరణలు అన్ని రంగాల్లోనూ ఆయన కలం సమానంగా రగిలింది. తెలంగాణ ప్రజల నిత్యజీవితాన్ని, వారి మాటతీరు, వారి మట్టిసువాసనను పదాలలో నింపగలిగిన అరుదైన శక్తి ఆయనకు ఉండేది.



**- ఒక కవి మరణం కాదు ఒక కాలానికి ముగింపు**

తన జీవితాంతం తెలంగాణ కోసం శ్వాసించిన కవి, తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఆత్మపరిశీలన, నిర్మాణం, సంస్కృతి వికాసం కోసం కలంతో కాపలాదారిగా నిలిచాడు. ఇంత గొప్ప ప్రతిభావంతుడైన సాహితీవేత్త ఇలా అకస్మాత్తుగా వెళ్లిపోవడం తెలుగు సాహిత్యానికి తిరుగులేని లోటు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి మాత్రమే కాదుతెలంగాణ మట్టి, భాష, భావాలకు ఆయన మరణం అంతులేని ఖాళీని మిగిల్చింది.

**- అంతిమ శ్రద్ధకు ఒకే మాట "జయ జయహే అందెశ్రీ"**

అందెశ్రీ వదిలి వెళ్లింది కేవలం గ్రంథాలు కాదుఅనేక తరాలను ప్రేరేపించే ఆలోచనలు, తెలంగాణ భావజాలాన్ని నిలబెట్టే బాణీలు, జాతి గౌరవాన్ని ప్రతిబింబించే అక్షరకిరీటం. ఉద్యమం పుట్టించి, ఊపిరి ఇచ్చి, చివరకు మౌనంలో కలిసిపోయిన ఈ మహాకవికి అమరత్వం ప్రజల నోట మాటగా కాదు. ప్రతి తెలంగాణవాడి రక్తంలో, హృదయధ్వనిలో, "జయ జయహే" స్వరంలో ఉండబోతోంది.



వ్యాసకర్త
**మంజుల శాగంటి**
అధ్యాపకురాలు ఎల్బీ కళాశాల
హనంకొండ వరంగల్

# పరీక్షే ప్రాణం తీసిందా...!

**- ఫీజు కట్టలేదని పరీక్షకు అనుమతి నిరాకరణ - నిప్పంటించుకుని విద్యార్థి మృతి**

**- విద్యార్థి ఉజ్వల్ రాణా విషాదాంతం - కాలేజీ యాజమాన్యం, పోలీసుల వ్యవహారంపై ఆగ్రహం**

**తొవ్వ డెస్క్ నవంబర్ 10**

ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. కాలేజీ ఫీజు చెల్లించలేదనే కారణంతో పరీక్ష రాసేందుకు అనుమతించకపోవడంతో విద్యార్థి ఆవేదనలో నిప్పంటించుకుని మృతిచెందాడు. ఈ హృదయవిదారక సంఘటన ముజఫర్‌నగర్ జిల్లా బుధానాలో జరిగింది. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 22 ఏళ్ల ఉజ్వల్ రాణా శనివారం పరీక్షకు కాలేజీకి వెళ్లాడు. అయితే ఫీజు చెల్లించలేదనే కారణంతో అతడిని పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. పరీక్షకు అనుమతి నిరాకరించడంపై ఉజ్వల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీనిని కారణంగా చూపుతూ కాలేజీ యాజమాన్యం పోలీసులను పిలిపించింది. అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థిని నొప్పించి వ్యవహరించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ అవమానం తట్టుకోలేక ఉజ్వల్ కాలేజీ బయటనే నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా కాలిన అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ఢిల్లీలోని సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మరణించాడు. ఈ ఘటనతో బుధానాలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఉజ్వల్ కుటుంబ సభ్యులు కాలేజీ మేనేజర్ అరవింద్ గార్గ్, ప్రిన్సిపాల్ ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయుడు సంజీవ్ కుమార్, అక్కడ విధులు నిర్వహించిన ముగ్గురు పోలీసులపై ఫిర్యాదు చేశారు. ఫీజు పేరుతో వేధింపులు, పోలీసుల ప్రవర్తనే ఉజ్వల్ మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీని ఆధారంగా పలు కేసులు నమోదు అయ్యాయి. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సంబంధిత



పోలీసు సిబ్బందిపై కూడా చర్యలు ప్రారంభమయ్యాయి. ఎస్ఐ నంద్ కిషోర్, కానిస్టేబుళ్లు వినీత్, జ్ఞాన్‌వీర్‌లను పోలీస్ లైన్‌కు పంపినట్లు ఎస్ఎస్పీ సంజయ్ కుమార్ తెలిపారు. నిందితులపై మరిన్ని చర్యల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. ఈ ఘటనపై ప్రతిపక్ష పక్షాలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాయి. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ లేకపోవడమే ఈ పరిస్థితులకు దారితీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధిత కుటుంబానికి ఒక కోటి రూపాయల పరిహారం, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

# భారత్ చుట్టూ ఉగ్రవాద వలయం

**- నేపాల్, బంగ్లాదేశ్‌లలో పాక్ పన్నాగం**

**- సరిహద్దు దగ్గర ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు ప్రయత్నాలు**

**- 'ఆపరేషన్ సిందూర్' తర్వాత వేగం పుంజుకున్న ఉగ్ర శక్తులు**

**- నిఘా వర్గాలు హైఅలర్ట్ - భద్రత పెంచిన భారత్**



**ఢిల్లీ, నవంబర్ 10**

భారత్ చుట్టూ ఉగ్రవాద వలయాన్ని ముడివేయడానికి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థలు కొత్త కుట్రలు పన్నుతున్నట్లు భారత నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్ ప్రాంతాల్లో ఉగ్ర శిక్షణ శిబిరాలు, నివాస స్థావరాలు ఏర్పాటు చేసే ప్రక్రియకు పాకిస్థాన్ సహకరిస్తోందని సమాచారం. సరిహద్దు ప్రాంతాల నుండి కొద్దికిలోమీటర్ల దూరంలో ఈ ఉగ్ర స్థావరాలు పనిచేయనున్నట్లు నిఘా రిపోర్టులు వెల్లడించాయి. ఇటీవల భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తరువాత ఉగ్ర సంస్థల చలనం మరింత వేగవంతమైందని ఇంటెలిజెన్స్

# జగన్ అక్రమాస్తుల కేసు..

**- కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐ కోర్టు ఆదేశం**

**- వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్‌పై విచారణ**

**- వీడియో కాన్ఫరెన్స్ హాజరుకు సిద్ధమని జగన్ వెల్లడి**

**హైదరాబాద్, నవంబర్ 10**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో, వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సీబీఐ కోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నెల 14వ తేదీ లోపు వ్యక్తిగతంగా హాజరుకావాలని సీబీఐ కోర్టు జగన్‌కు ఆదేశించింది. గడువు సమీపిస్తుండడంతో, తాజాగా జగన్ తరపు న్యాయవాదులు మెమో దాఖలు చేసి, వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు కల్పించాల్సిందిగా కోరారు. కోర్టు అనుమతిస్తే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావడానికి సిద్ధంగా ఉన్నట్టు మెమోలో పేర్కొన్నారు. జగన్ పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు, సీబీఐ తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించింది. దీనిపై సీబీఐ కౌంటర్ దాఖలు చేసిన అనంతరం తదుపరి విచారణ కొనసాగనుంది.

# అందెశ్రీ మరణం పూడ్చలేని లోటు :మోడీ



తెలంగాణకు రాష్ట్ర గీతం అందించి, తెలుగు సాహిత్యానికి ప్రత్యేక స్పందనను చేకూర్చిన ప్రముఖ కవి అందెశ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సాంస్కృతిక%–మేధో ప్రపంచానికి పూడ్చలేని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని, ప్రజల పోరాటాలు, ఆకాంక్షలు, అచంచల స్ఫూర్తికి ఆయన గొంతుకగా నిలిచారని మోదీ తన నివాళిలో అన్నారు. కవిగానే కాదు మేధావిగా కూడా అందెశ్రీ చూపిన దారి అత్యంత ప్రేరణాత్మకమని హైలైట్ చేశారు. అందెశ్రీ పదాలకు హృదయాలను కదిలించే శక్తి, ప్రజల ఆశయాలను ఏకం చేసే శక్తి ఉందని, సామాజిక స్పృహను సాహితీ సౌందర్యంతో మేళవించిన ఆయన శైలి అద్వితీయమని మోదీ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ "ఓం శాంతి" అని ముగించారు.

# తెలంగాణ గర్వకారణం.. గేయ రచయిత అందెశ్రీ..

జన్మస్థలం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా (పూర్వం వరంగల్ జిల్లాలోని ఒక గ్రామం)
జననం: 1957 ప్రాంతంలో
మరణం: 2025 నవంబర్ 10

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో, భాషా సంస్కృతిలో, సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న పేరు – అందెశ్రీ. ఆయన అసలు పేరు ఆండే శ్రీనివాస్. కానీ ఆయనను ప్రజలు అందెశ్రీ అని ప్రేమగా పిలిచారు. తెలంగాణ ఉద్యమం, ఆత్మగౌరవం, మట్టి వాసన, ప్రజా స్ఫూర్తిని కలిపి రాసిన ఆయన గీతాలు తెలుగు ప్రజల హృదయాలను కదిలించాయి..

**రాష్ట్ర గీతం "జయ జయ హే తెలంగాణ..**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రతీకగా నిలిచిన గీతం జయ జయ హే తెలంగాణ, జయ హెూ మహా తెలంగాణ ను రచించినవారు అందెశ్రీ ఈ గీతం కేవలం ఒక పాట కాదు – ఇది తెలంగాణ ప్రజల ఆత్మగీతం.

ఉద్యమ కాలంలో వేలాది మంది ప్రజలకు ధైర్యం, ఆశ, గర్వం ఇచ్చిన గీతమిది. 2014లో రాష్ట్ర ప్రభుత్వం ఈ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తించింది. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో, విద్యాసంస్థల్లో ఈ గీతం ప్రతిధ్వనించడం ఆయనకు లభించిన అతి పెద్ద గౌరవం.

**సాహిత్య ప్రస్థానం..**

అందెశ్రీ గారు చిన్న వయసులోనే రచనలపై ఆసక్తి పెంచుకున్నారు.

పల్లె జీవన విధానం, రైతుల కష్టాలు, ప్రజల ఆశలు, తెలంగాణ మట్టి సుగంధం ఆయన కవితల్లో ప్రతిఫలిస్తాయి.

ఆయన రచనలు లోతైన భావాలతో పాటు ప్రజల మాటల సౌలభ్యాన్ని కూడా కలిగి ఉంటాయి.. తెలంగాణ భాషా బాష్యం, జానపద రీతిలో రాసిన ఆయన కవితలు సులభంగా ప్రజల మనసుల్లో చోటు సంపాదించాయి.

ఆయనను ప్రజా కవి, తెలంగాణ ఆత్మగీతకర్త గా పిలిచేవారు..

**వ్యక్తిత్వం..**

సాదాసీదా జీవనశైలి గల అందెశ్రీ ఎల్లప్పుడూ నేలమాళిగా ఉండేవారు.

ఆయనకు పదవులు, ప్రతిష్టలు అంతగా ముఖ్యమేమీ కాదు.

తెలంగాణ భాషా సౌందర్యం, మట్టి వాసన, ప్రజా భావాలు ఆయన కలానికి ప్రేరణ..

**గౌరవాలు..**

అందెశ్రీ గారు పలు సాహిత్య పురస్కారాలను అందుకున్నారు.

ఆయన గీతాలు పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రజా సభల్లో పాడబడుతూ ఉన్నాయి.

తెలంగాణ సాహిత్య చరిత్రలో ఆయన పేరు చిరస్మరణీయం..



వ్యాసం : మద్దెల రాజేష్
సామాజిక సేవ కార్యకర్త..

# అందెల జ్వాల..అందేశ్రీ

**తొవ్వ ముచ్చట్లు**

నియంతృత్వ పాలనపై అందె కట్టి
గర్జించిన గళం మూగబోయిందా.
జయ జయహే తెలంగాణ
జననీ జయ కేతనమంటూ..
తెలంగాణ అస్థిత్వ జయకేతనాన్ని
ఎగురవేసిన ఆత్మగౌరవ పొలికేక
ఇక కనపడదే అని తెలంగాణ
కన్నీటి పర్యంతమై దీనంగా
చూస్తుంది
అందెశ్రీ..
అందెల జ్వాల ఆగిపోయిందని..
మాయమైపోతున్నడమ్మా..మనిషన్న
వాడనీ
మానవత్వాన్ని.. మనిషి తత్వాన్ని
శాసించిన తెలంగాణ మట్టితనాన్ని
వెదజల్లిన తెలంగాణ చైతన్య దీప్తి
అందెశ్రీ..
నీ బాధ తీరేది కాదనుకొనేమో
ఈ మనసులేని మనుషులని
వదిలి వెళ్లి పోయావా..



మా కోసం తెలంగాణ రాష్ట్ర గీతం
జాలువార్చిన నీ ఆత్మీయ కలం
జన బాహుళ్యాన్ని చైతన్యపర్చి
అనంత లోకాలకు తరలి వెళ్ళిందా
అందెశ్రీ..
నీ మరణం.. సాహిత్య లోకానికి
తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటు
తెలంగాణ శ్వాసకు బాధాతప్త
తరుణం
తెలుగు భాష తీర్చుకోలేని రుణం
తెలంగాణ జనతకు మీరు సదా
స్మరణం

# పర్యావరణ పరిరక్షణ అవార్డులు..

**రాయికల్, నవంబర్ 10:** రాయికల్ మండల వ్యాప్తంగా మట్టి గణపతి విగ్రహాల ప్రతిష్ట, ప్రకృతి, పర్యావరణ రక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేసిన వ్యక్తులకు, సంస్థలకు పర్యావరణ రక్షాక్ అవార్డులు... కరోనా సమయంలో సామజిక సేవ చేసిన వైద్యులకు, రక్తదాతలకు, యువ నాయకులు, మార్గదర్శకులు, విద్యావేత్తలకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు, న్యాయవాదులకు వివిధ కేటరిగిలో ప్రజాచైతన్య వేదిక ఆధ్వర్యంలో అవార్డులు అందజేయనున్నట్లు చింతకుంట సాయికుమార్ తెలిపారు.

మొదటి విడతగా పర్యావరణ రాక్షాక్ అవార్డు రాయికల్ మహేంద్ర సంఘం, గోనే కాపు రెడ్డీస్, ఆలూర్.. నవదుర్గ సేవ సమితి, రాయికల్ విశ్వా యూత్, మెసారపు శ్రీకాంత్ (మట్టి వినాయక విగ్రహాలు పంపిణి), మాచర్ల మారుతి (పంక్షన్ లకు ఉచితంగా స్టీల్ గ్లాస్‌లు) అంబల్ల శివా (పర్యావరణ హితంగా పంక్షన్ నిర్వహణ), సుంకిశాల సత్తయ్య (మొక్కల పునరుద్దరణ పార్క్ ఏర్పాటు) ఎంపిక చేసినట్లు సాయి కుమార్ తెలిపారు. త్వరలో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డులు అందజెయ్యనున్నట్లు ప్రజా చైతన్య వేదిక రాయికల్ చింతకుంట సాయికుమార్ తెలిపారు.

# లక్ష కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ ఓకే

**విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అసైన్డ్ భూములు**

**చట్టంలో కీలక సవరణలతో ఆర్డినెన్స్ జారీకి ఆమోదం**

**విశాఖలో పలు ఐటీ సంస్థలకు భూ కేటాయింపులకు అంగీకారం**

**కుప్పం, ఓర్వకల్లు, నాయుడుపేటల్లో పలు పరిశ్రమలకు కూడా..**

**క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి**

**అమరావతి, నవంబరు 10:** రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. 70 అంశాలకు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరాలు వెల్లడించారు. అభివృద్ధి , యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా దాదాపు లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలసీల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక నూతన విధానాలను రూపొందించిన ఫలితంగా ప్రపంచంలోని అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని తెలిపారు.

**మంత్రివర్గ నిర్ణయాలివీ..**

ఏపీ క్యాంటమ్ కంప్యూటింగ్ విధానం 2025-30కి ఆమోదం. క్యాంటింగ్ కంప్యూటింగ్ సెంటర్ల ఏర్పాటుకు స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, తయారీదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలకు అంగీకారం. బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యం.నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ విధానానికి ఆమోదం. ప్రతి మండలంలో 20 నుంచి 30 వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయం.

విశాఖలో రియాల్టీ, రహేజా, ఏఎన్ఎసఆర్ గ్లోబల్ కార్పొరేషన్, క్యూఎంట్ గ్రిడ్ లిమిటెడ్ తదితర ఐటీ సంస్థలకు భూముల కేటాయింపు.రూ.550 కోట్లతో శ్రీసిటీలో పీసీబీఏ, బీఎల్‌డీసీ మోటార్లు, కాపర్‌ట్యూబ్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఎస్‌సీఐజీ వెంచర్స్‌కు అనుమతి.క్రయాన్ టెక్నాలజీ శ్రీసిటీలో ఏర్పాటుచేస్తున్న ఐటీ ఎన్‌క్లోజర్లు, పీసీబీ బేర్ బోర్డుల తయారీ పరిశ్రమకు ప్రోత్సాహకాలు. కుప్పంలో రూ.2081 కోట్ల పెట్టుబడితో యానోడ్ మెటీరియల్ తయారీ సౌకర్యం ఏర్పాటు చేయడానికి ఎన్‌పీఎసపీఎల్ అడ్వాన్స్ మెటీరియల్స్ సంస్థకు అనుమతి. 60 శాతం మూలధన రాయితీ, విద్యుత్ రాయితీ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి ఆమోదం.కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఇండిచిప్స్ సెమీకండక్టర్స్ లిమిటెడ్‌కు 150 ఎకరాలు. ఓర్వకల్లు డ్రోన్ సిటీలో 50 ఎకరాల్లో డెడికేటెడ్ డ్రోన్ పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం.ఓర్వకల్లులో రూ.1,090 కోట్లతో సింథటిక్ ఆర్గానిక్ ప్లాంట్ ఏర్పాటు కోసం సిగాచి ఇండస్ట్రియల్ లిమిటెడ్‌కు 100 ఎకరాలు.నెల్లూరులో ఫైబర్ సిమెంట్ ప్లాంట్ కోసం బిర్లా లిమిటెడ్‌కు 48.47 ఎకరాలు.అనకాపల్లి జిల్లాలో రూ.489 కోట్లతో రక్షణ పరికరాల తయారీ కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌కు 160 ఎకరాలు.ఇదే జిల్లో రూ.1,234 కోట్లతో భారీ భూమి తవ్వే పరికరాలు, విడిభాగాలు తయారీ పరిశ్రమ ఏర్పాటుకు డోస్కో ఇండియాకు 150 ఎకరాలు.కృష్ణా జిల్లాలో 40 ఎకరాల ఎంఎసఎంపీ పారిశ్రామిక పార్క్‌కు శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి.

అనంతపురంలో రూ.1,247 కోట్లతో సమీకృత టీఎంటీ బార్ ప్లాంట్ ఏర్పాటుకు సుగుణ స్పాంజ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 308 ఎకరాలు.

రూ.8,570 కోట్లతో విజయనగరంలో సమీకృత ఉక్కు ప్లాంటు ఏర్పాటుకు సూపర్‌స్మెల్టర్స్ లిమిటెడ్‌కు 1,085 ఎకరాలు.కుప్పంలో రూ.898 కోట్లతో తోలుకాని ఫుట్‌వేర్ తయారీ కోసం వ్యాసేంగ్ ఫుట్ వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 103.19 ఎకరాలు.నాయుడుపేట సెజ్‌లో రూ.1,743 కోట్లతో 4జీడబ్ల్యూ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ పరిశ్రమకు వోల్ట్‌సన్ ల్యాబ్స్‌కు 40 ఎకరాలు.

రూ.44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్‌డ్‌కు అదనంగా 250 ఎకరాలు. కంప్రెస్డ్ బయో-గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం పులపత్తూరులో 50 ఎకరాలు, గుండ్లూరులో 100 ఎకరాలు లీజుపై అప్పగింత.కృష్ణా జిల్లా మచిలీపట్నం టౌన్ మాచవరం ప్రాంతంలో టీడీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి 1.60 ఎకరాల ప్రభుత్వ భూమి.

తిరుపతి అవిలాలలో టీడీపీ కార్యాలయానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమి.సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు శ్రీసత్యసాయి జిల్లా దిమ్మనాయునిపేట, నంది పాడు, ఇరువరం గ్రామాల్లో 38.10 ఎకరాలు.ఈ నెల 14-15 తేదీల్లో విశాఖ భాగస్వామ్య సదస్సులో పర్యావరణ అనుకూల పట్టణ పరిపాలన, డిజిటల్ పరిపాలన మానవనరుల అభివద్ధి, సుస్థిర ఆర్థికాభివృద్ధి వంటి రంగాల్లో సింగపూర్ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆమోదం.ఉండవల్లి వద్ద మరో పంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రూ.595 కోట్ల రుణం తీసుకునేందుకు ఆమోదం.రాజధాని అమరావతిలో కృష్ణాయపాలెం వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి జోన్-8 ప్రాంతంలో, పెనుమాక లే అవుట్‌లో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో అనుసంధానంగా ఉండే 'రోడ్లు, డ్రైనేజీలు, నీటి సరఫరా, మురుగునీరు, విద్యుత్ ఐసీటీ కోసం యుటిలిటీ డక్టులు, రీయూజ్ అవెన్యూ ప్లాంటేషన్' కోసం రూ.1,863.00 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఇచ్చేందుకు ఆమోదం. అమరావతిలోని ఎల్‌పీఎస్ జోన్-4, 9, 12ల అభివృద్ధి కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (న్యాబ్‌ఫిడ్) నుంచి రూ.7,500 కోట్ల రుణం పొందేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద బాపట్ల జిల్లా బల్లికురవ మండలం, ఎస్ఎల్ .గుడిపాడు, ముక్తేశ్వరం గ్రామాల్లోని కుందూరు (తూర్పు) గ్రామం, సంతమాగులూరు మండలంలో దాదాపు 1,000 ఎకరాల్లో పునరుత్పాదక ఇంధనం మాన్యుఫాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు ఆమోదం.

# ఎవరి ధీమా వారిదే

**జూబ్లీహిల్స్‌లో గెలుపు తమదంటే తమదంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్**

**గట్టి పోటీ ఇస్తామంటున్న బీజేపీ**

**హైదరాబాద్, నవంబరు 10:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. పోటీలో ఉన్న మూడు ప్రధాన పార్టీలకూ ప్రతిష్ఠాత్మకంగా మారింది. దీంతో గత కొద్దిరోజులుగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల యంత్రాంగాలు మొత్తం ఈ నియోజకవర్గంలోనే మోహరించి ప్రచారం చేశాయి. రాజకీయంగా, ఆర్థికంగా తమ శక్తియుక్తులన్నీ ఖర్చు చేసి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేశాయి. ఇప్పుడిక ఓటర్ల వంతు వచ్చింది. మంగళవారం జరగనున్న పోలింగ్‌లో ప్రధాన పార్టీలు, ఆ పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల భవితవ్యాన్ని వారు తేల్చనున్నారు. అయితే ఇన్ని రోజులుగా నిర్వహించిన ప్రచారం.. ఓటర్ల స్పందనను బట్టి ఉప ఎన్నికలో తమ పార్టీ జెండానే ఎగరడం ఖాయమంటూ అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల్లో ఎలా గెలుస్తామన్న దానిపై అంచనాలూ వేసుకుంటున్నాయి. బీజేపీ సైతం గట్టి పోటీ ఇస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తోంది. కాగా, రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లిట్మస్ టెస్టుగా మారింది. కంటోన్మెంట్ మినహా హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. డివిజన్‌కు ఇద్దరు చొప్పున మంత్రులను ఇన్‌చార్జులుగా నియమించడమే కాకుండా.. పార్టీ యంత్రాంగం మొత్తాన్నీ వారంరోజులుగా నియోజకవర్గంలోనే మోహరించారు. అన్ని డివిజన్లనూ చుట్టేస్తూ స్వయగా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రచారం చేశారు. మంత్రులూ తమకు కేటాయించిన డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వాస్తవానికి జూబ్లీహిల్స్ సీటు.. కాంగ్రెస్ పార్టీకి సిటింగ్ సీటు కాదు. వరుసగా 2014, 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెసకు ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం దక్కలేదు. కానీ, హైదరాబాద్‌లో పార్టీ ప్రాతినిధ్యం పెంచుకునేందుకు, ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల వైఖరి ఉందని చాటుకునేందుకు ఈ ఎన్నికను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శక్తియుక్తులన్నీ కేంద్రీకరించి పని చేసింది. నియోజకవర్గంలోని మైనారిటీ ఓటర్లను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రి పదవి కూడా ఇచ్చారు. అలాగే ఎంఐఎం మద్దతునూ కూడగట్టారు. గతంలో ఈ నియోజకవర్గంలోని ముస్లింలలో అత్యధికులు బీఆర్ఎసకు మద్దతుగా ఉండేవారని, కానీ.. లోక్‌సభ ఎన్నికల నాటికి వారిలో ఎక్కువ మంది కాంగ్రెసకు మద్దతు పలికారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలిచినా.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికే మెజారిటీ వచ్చిందని గుర్తు చేస్తున్నాయి. ఇక తమ అభ్యర్థి నవీన్‌యాదవ్ బీసీ, విద్యాధికుడు కావడం, బీసీ సంఘాలు పూర్తి మద్దతు ఇవ్వడంతో బీసీల్లోని మెజారిటీ ఓటర్లు ఆయన వైపే మొగ్గు చూపుతున్నారని అంటున్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు నీటి ట్యాంక్ అందజేత



**రాయికల్, నవంబర్ 10:** రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వేయి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్...పదవతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు లయన్ రీజినల్ చైర్మన్ గుంటుక సురేష్, డిసి మ్యాకల రమేష్, ఆడెపు రాంప్రసాద్ ల సహకారంతో మూడు బస్తాల అటుకుల సంచులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన అభినందనీయమని....విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నవంబర్ లో నిర్వహిస్తున్న డయాబెటిక్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్, కోశాధికారి బెక్కం తిరుపతి, డిసి బత్తిని భూమయ్య, ఉపాధ్యక్షులు వాసం స్వామి, సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, కొయ్యేడి మహిపాల్, కాటిపెల్లి రాంరెడ్డి, ఆడెపు రాంప్రసాద్, సుదవేణి మురళి, నిమ్మల వెంకట్ రెడ్డి, ఎలిగేటి అనిల్, కట్ల నర్సయ్య, పారిపెల్లి శ్రీనివాస్, సాంబారు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పొన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**రాయికల్, నవంబర్ 10:** రాయికల్ పట్టణంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సాంబార్ శివ కుటుంబ సభ్యులను, సౌదీలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన తోట ధర్మయ్య కుటుంబ సభ్యులను సోమవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించారు. వీరి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, మండ రమేష్, మహిపాల్ రెడ్డి, గంగాధర్, బాపురపు నర్సయ్య బత్తిని భూమయ్య నరేష్, శివ, ఎద్దండి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరువుపై అందరికి హక్కు ఉంది



**రాయికల్, నవంబర్ 10:** రాయికల్ మండలం ఆలూరు గ్రామ ప్రజలు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలూరు గ్రామంలోనీ కొత్తచెరువు ఏ ఒక్క కులానికి, కుల సొసైటీకి చేయడానికి గ్రామపంచాయతీ ఇప్పటివరకు తీర్మానం ఇవ్వలేదని కావున కుల సంఘాల, ప్రజల వినతి పత్రాన్ని పరిశీలించి గ్రామస్తులకు న్యాయం చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్, మత్స్య శాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## రచయిత అందెశ్రీకి నివాళులు



**రాయికల్, నవంబర్ 10:** రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రచయిత, ప్రముఖ కవి అందెశ్రీకి నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి..రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాలె శేఖర్ మాట్లాడుతూ అందెశ్రీ రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిదాయకమని, ఆయన కలం తెలంగాణ ఆత్మ, సంస్కృతి ప్రతిధ్వనిం చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో వేంటనే కొనుగోళ్ళు ప్రారంభించాలి



**రాయికల్, నవంబర్ 10:** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఐకెపి కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్ళు వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి ఐకేపి సెంటర్ ను సోమవారం సందర్శించి గన్ని బ్యాగులు రాలేదని తెలుసుకొని అధికారులతో, రైస్ మిల్లర్లతో మాట్లాడి గన్ని బ్యాగులను వెంటనే తీసుకురావాలని.. మ్యచర్ బాక్స్ పనిచేయడం లేదని ఇప్పటివరకు మ్యాచర్ చూడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజరెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, కొయ్యడి మహిపాల్, మండ రమేష్, ఆదిరెడ్డి, జలంధర్ రెడ్డి, సత్యం, జీవన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రమేష్, సాగర్, లక్ష్మణ్, అనిల్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో భారీ పేలుడు

## ఎర్రకోట సమీపంలో పేలిన కారు

**9 మంది మృతి 24 మందికి గాయాలు**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** దేశ రాజధాని ఢిల్లీ.. భారీ పేలుడుతో దద్దరిల్లింది! దేశంలోని అత్యంత హై ప్రొఫైల్ ప్రాంతాల్లో ఒకటి.. పంద్రాగస్టునాడు దేశ ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించే ఎర్రకోటకు సమీపంలో మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో కారు పేలి 9 మంది మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు! క్షతగాత్రులను హుటాహుటిన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని.. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఢిల్లీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్న రోజునే.. అదీ హరియాణా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కారులో పేలుడు జరగడంతో.. దీని వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు, ఇతర కేంద్ర సంస్థల సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పేలుడు ?తీవ్రతకు ఘటనా స్థలి వద్ద భీతావహ దృశ్యాలు కనిపించాయి. మృతదేహాలు ఛిద్రమై శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపైన, పక్కనే ఉన్న వాహనాలపైనా పడ్డాయి. పేలుడు ధాటికి.. చుట్టూ ఉన్న వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు కార్లు, రెండు ఈ-రిక్షాలు, ఒక ఆటో అగ్నికి ఆహుతైపోయాయి. మొత్తం 22 కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలికి సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. భవనాలు కంపించాయి. ఈ పేలుడు జరిగిన మూడు నిమిషాలకే అగ్నిమాపక శాఖకు ఫోన్ కాల్ వెళ్లింది. వెంటనే ఏడు యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది 20 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు రంగంలోకి దిగి.. 7.29 గంటలకల్లా.. అంటే పేలుడు జరిగిన 40 నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పేలుడుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చా వెల్లడించారు. "సాయంత్రం 6.52 గంటలకు.. రెడ్‌ఫోర్ట్ మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో నిదానంగా వచ్చిన ఒక కారు అక్కడ ఆగీ ఆగగానే పేలిపోయింది. ఆ సమయంలో ఆ కారులో ప్రయాణికులున్నారు. పేలుడు ధాటికి దాని చుట్టుపక్కలున్న వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని ఆయన తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలతోపాటు.. జాతీయ దర్యాప్తు సంస్థ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, సీఆర్పీఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు ఏజెన్సీల అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తెలుపుతున్నట్టు వెల్లడించారు. పేలిపోయిన కారులో ముగ్గురు ఉన్నట్టు మరో సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. "పేలుడు జరిగిన చోట ఎలాంటి గుంతా పడలేదు. పేలుడు ధాటికి గాయపడ్డవారి శరీరాల్లో ఎలాంటి పెల్లెట్లూ కనిపించలేదు. బాంబు పేలుడు అయితే ఇలా జరగడం అసాధారణం. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. అందులో భాగంగా.. ఆ కారు ఏయే ప్రాంతాల్లో తిరిగిందో తెలుసుకోవడానికి నగరంలోని అన్ని సీసీటీవీ కెమెరాలనూ జల్లెడపడుతున్నారు. పేలుడుకు ముందు ఏదైనా అనుమానాస్పదంగా కనిపించిందా? అని స్థానికులను, ప్రత్యక్షసాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో పేలుడుకు ముందు నమోదైన ఫోన్‌కాల్స్ డేటాను విశ్లేషిస్తున్నారు.

**కారెవరిది?**

హరియాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న హ్యూందాయ్ ఐ20 కారులో పేలుడు జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ కారు నదీం అనే వ్యక్తి పేరిట ఉన్నట్టు సమాచారం. కారు యజమానిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి ఈ కారును ఏడాదిన్నర క్రితం సలీం అనే వ్యక్తి.. దేవేంద్ర అనే వ్యక్తికి విక్రయించాడని సమాచారం. గురుగ్రామ్ పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవేంద్ర ఆ తర్వాత ఆ కారును హరియాణాలోని అంబాలకు చెందిన వ్యక్తికి అమ్మినట్టు తెలిసింది.

**భయంతో పరుగులు..**

"అంత పెద్ద భారీ పేలుడు శబ్దాన్ని మా జీవితంలో ఎప్పుడూ వినలేదు" అని ఘటనాస్థలికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు పలువురు తెలిపారు. "పేలుడు జరిగిన సమయంలో నేను నా దుకాణంలో ఉన్నాను. పేలుడు ధాటికి నా కుర్చీలోంచి కింద పడిపోయాను. వెంటనే లేచి బయటకు పరుగెత్తాను. చాలామంది ఆ సమయంలో తలోదిక్కుకూ పరుగులు తీయడం కనిపించింది" అని అక్కడి ఒక దుకాణదారు చెప్పారు. "నేను మా ఇంటి టెర్రస్ మీద ఉండగా.. పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. చూస్తే దూరంగా అగ్ని జ్వాలలు. పేలుడు ధాటికి భవనాల కిటికీలు కదిలిపోయాయి" అని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు. పేలుడు ఘటనతో ఢిల్లీని అనుకుని ఉన్న యూపీ జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మతపరంగా, ఇతరత్రా సున్నితమైన ప్రార్థన మందిరాలు, ఢిల్లీ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు.

**మా వాళ్లని చూడనివ్వట్లేదు..**

ఈ పేలుడులో గాయపడ్డవారి కుటుంబసభ్యులు, బంధువులు.. విషయం తెలియగానే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి చేరుకుని తమవారి కోసం ఆందోళనతో ఆరా తీశారు. గాయపడ్డ తమవారిని చూడ్డానికి ఆస్పత్రి సిబ్బంది తమను అనుమతించట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పేలిన కారు కదలికల కోసం సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. ఆ కారు దరియాగంజ్ మార్కెట్ నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటల సమయానికి సునెహ్రీ మసీదు పార్కింగ్ ఏరియా వద్దకు చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం ఆ కారు మళ్లీ ఛత్తా రైల్‌చౌక్ వద్ద యూటర్న్ తీసుకుని.. లోయర్ సుభాష్ మార్గ్ దిశగా వెళు_న్న దృశ్యాలను గుర్తించారు. అక్కడ ఆ కారు సిగ్నల్ వద్దకు చేరుకుంటూ నెమ్మదించిందని.. అప్పుడు పేలుడు జరిగిందని ఓ అధికారి తెలిపారు. పేలుడు దెబ్బకు కారులో ఉన్న ముగ్గురూ ఛిద్రమైపోయారని తెలిపారు.

**పేలుడుకు కారణం ఇప్పుడే చెప్పలేం..**

పేలుడు ఘటనపై కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్‌తో, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఐఏ చీఫ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# బతుకు బండే పాటగా అందె!

## సోమవారం ఉదయం ఇంట్లోనే కుప్పకూలిన సహజ కవి

**హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి**

**ప్రభుత్వ లాంఛనాలతో నేడు ఘట్‌కేసర్‌లో అంత్యక్రియలు**


**అక్కడి ఔటర్ జంక్షన్లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు**

**లాలాపేట ఇంటి నుంచి ఔటర్ జంక్షన్ వరకూ అంతిమ యాత్ర**

**అంత్యక్రియలకు హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ప్రజల సందర్శనార్థం జయశంకర్ స్టేడియంలో మృతదేహం**

**- తరలివచ్చిన నేతలు, అభిమానులు - ఘనంగా నివాళులు**



**హైదరాబాద్, నవంబరు 10:** సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి ఆయన సొంతూరు. అక్కడే ఆయన చిన్నతనమంతా గడిచింది. దళిత కుటుంబంలో పుట్టారు. అండె బొడ్డయ్య, ఎల్లవ్వ దంపతులకు ముగ్గురు సంతానంలో అందెశ్రీనే పెద్దవారు. పాలబుగ్గల వయసులో తల్లిదండ్రుల నుంచి ఆదరణ కరువైంది. బడిఈడు వచ్చినా కన్నవారు వెన్నుతట్టలేదు. ఎన్నడూ బడికి పోయిందే లేదు. బాలుడిగా ఉన్న అందెశ్రీని ఆ ఊర్లోనే జక్కిరెడ్డి రాధమ్మ చేరదీసింది. కొన్నాళ్లకు ఆమె కుమారుడు జక్కిరెడ్డి మల్లారెడ్డి జీతానికి కుదిరి బర్లు మేపాడు. గ్రామంలోని మునీరు సేటు, డాకూరి బాల్‌రెడ్డి వద్దా బర్లు మేపారు.

**అలా అందెశ్రీగా మారి..**

బాల్యంలో పదేళ్లు పశువుల కాపరిగానే పనిచేశారు అందెశ్రీ. తర్వాత భవన నిర్మాణ రంగంలో కూలీ పనుల కోసం నిజామాబాద్ వెళ్లారు. అక్కడ ఆయన్ను శృంగేరీ శంకర మహరాజ్ అక్కున చేర్చుకున్నారు. అప్పటిదాకా అందె ఎల్లయ్యగా ఉన్న ఆయన పేరును అందెశ్రీగా మార్చింది ఆ మహారాజే. అడ్డుతగిలిన వారిని ధిక్కరించి అందెశ్రీకి ఉపనయనం నిర్వహించి.. గాయత్రి మంత్రాన్ని ఉపదేశించారు. 'ఎంగిలి పాటలు ఎన్నాళ్లు పాడతావు? బతుకు పాటలు రాయి' అంటూ వెన్నుతట్టారు. ఆయన ప్రోత్సాహంతోనే ఛందస్సు నేర్చుకున్నారు.

**మంచి గుణమే పిల్లనిచ్చేలా చేసింది**

నా అనేవాళ్లేవరూ లేని తనకు పెళ్లి కావడం కష్టమనుకున్న ఒకానొక దశలో సన్యాసం స్వీకరించాలనుకున్న అందెశ్రీకి పెళ్లి కుదరడం రసవత్తరమైన సినీసన్నివేశానికి తక్కువేమీ కాదు. ఒకరోజు ఆయన బస్సులో వెళుతుండగా పక్కన ఓ పెద్దాయన కూర్చుకున్నారు. ఇద్దరూ అవీఇవీ మాట్లాడుకున్నారు. అందెశ్రీ కవితా ధోరణితో కూడిన మాటలకు ఆవలి వ్యక్తి అబ్బురపడ్డారు. కుర్రాడికి అమ్మానాన్న ఆస్తిపాస్తులు లేకపోతేనేమి? మంచి గుణం, సాహితీ సంపద ఉంది అదే చాలు అనుకున్నారాయన. అప్పుడే అందెశ్రీని తన అల్లుడిగా ఖాయం చేసుకున్నారు. తన కుమార్తె మల్లికను అందెశ్రీకి ఇచ్చి పెళ్లి చేశారు. తాడూ బొంగరం లేనివాడికి కుమార్తెను కట్టబెడుతున్నావం టూ బంధువులు దెప్పిపొడిచినా పట్టించుకోలేదు.

**అప్పుడు ఆత్మహత్యే శరణ్యం అనుకున్నారు**

బాల్యమంతా కష్టాలకడలిలోనే గడిపిన అందెశ్రీని పెద్దయ్యాక కూడా పేదరికం వదల్లేదు. 1994 రోజులవి! ఆయన తాపీ పనికి వెళ్లేవారు. రోజుకు 13 రూపాయలొచ్చేవి. తీవ్ర ఆర్థిక సమస్యలకు తోడు.. అనారోగ్యంతో రెండో కుమారుడు (5ఏళ్లు) మృతిచెందడం ఆయన్ను కుంగదీసింది. బాబుకు కనీసం వైద్యం కూడా చేయించలేకపోయానన్న బాధతో భార్య, పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. అయితే ఈ ఆపత్కాలంలో హోమియో వైద్యుడు రామకృష్ణ చేసిన సాయం, యలమంచలి శేఖర్‌తో పరిచయం ఆయన్ను సమస్యల సుడిగుండాల నుంచి బయటపడేలా చేశాయి. 'ఆ శోకంలో ఒక శ్లోకం చదివి..' అంటారు వాల్మీకి గురించి 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అనే పాటలో వేటూరి. అచ్చంగా ఇలానే.. 'శోకం నుంచే నా గానం పుట్టింది' అని సగర్వంగా ప్రకటించుకున్నారు అందెశ్రీ.

**అసెంబ్లీ భవన ప్రాంగణంలో కూలీగా..**

తాపీమేస్త్రిగా అందెశ్రీ 22 ఏళ్లు పనిచేశారు. 1979లో నిజామాబాద్ నుంచి కుటుంబంతో హైదరాబాద్‌కు మారారు. 1984లో తెలంగాణ అసెంబ్లీ భవన ప్రాంగణంలోని ఓ నిర్మాణంలో కొన్నాళ్లు కూలీగా పని పనిచేశారు. సభలోపల ప్రజాప్రతినిధులు కూర్చునే కుర్చీలను కూడా తాను బిగించానని ఆయనే స్వయంగా 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. చిత్రంగా తర్వాత రోజుల్లో తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన రచయితగా అదే అసెంబ్లీలో చట్టసభ్యుల మన్ననలను పొందారు.

**ఆ చివరి కోరిక తీరకుండానే..**

అందెశ్రీ వాగ్దేవిని అమ్మగా కొలుస్తారు. అలా అని సంప్రదాయవాది కాదు. మార్క్సిజాన్ని ప్రేమిస్తారు. అలా అని వామపక్షవాది అంతకన్నా కాదు. నేను ఒక మనిషిని అని ప్రకటించుకున్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, ఉద్ధంసింగ్ వంటి మహనీయుల విగ్రహాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలి. దాన్ని దేశం గర్వించదగ్గ యాత్రాస్థలిగా తీర్చిదిద్దాలన్నది తన చివరి కోరికగా అందెశ్రీ ఒక వేదికపై చెప్పారు. అది తీరకుండానే మాయమైపోయారు.

**వారంతా మలిచిన మనిషిని తాను అంటూ..**

'మాయమైపోతున్నాడమ్మ మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు మానవత్వం ఉన్నవాడు' అంటూ సిరాతో ఆవేదనను చిలకరించిన అందెశ్రీ.. కష్టకాలంలో తనకు దన్నుగా నిలబడిన వారిని మహనీయులుగా తన గుండెల్లో పెట్టుకున్నారు. తనను ఆదుకున్న వ్యక్తులను వేదికలపై ఎన్నోసార్లు గుర్తుచేసుకున్నారు. ప్రముఖ జానపద సాహిత్య పరిశోధకుడు ఆచార్య బిరుదురాజు రామరాజు దగ్గర అందెశ్రీ 20 ఏళ్లకుపైగా శిష్యరికం చేశారు ఆ అనుబంధంతో రామరాజును ఆయన 'నాన్న' అని, ఆయన భార్య సూర్యదేవమ్మను 'అమ్మా' అని సంబోధించేవారు. సూర్యదేవమ్మ తనను అమ్మలా ఆదరించారన్న కృతజ్ఞతతోనే 'సూడ సక్కని నా తల్లి.. సుక్కల్లో జాబిల్లి" అంటూ ఆమె మాతృహృదయాన్ని కొనియాడుతూ పాట రాశారు. తర్వాత ఈ పాట.. ఆర్. నారాయణమూర్తి చిత్రం "ఊరు మనదిరా" ద్వారా శ్రోతల ఆదరణ పొందింది. తనకు ఆధ్యాత్మిక గంధాన్ని అద్దిన జక్కిరెడ్డి మల్లారెడ్డిని, తనకు మొట్టమొదటిసారి కొత్త బట్టలు కుట్టించిన మునీరుద్దీన్ సేటును, దారితెన్నూ లేక తన జీవననావ సుడిగుండంలో చిక్కుకున్న దశలో తనను అక్కున చేర్చుకొని.. తన పేరును అందెశ్రీగా మార్చి.. జ్ఞానబోధ చేసిన శృంగేరి శంకర మహరాజును, ఆపత్కాలంలో తనకు అన్నం పెట్టిన యలమంచలి శేఖర్‌ను.. ఇలా తన జీవన ప్రయాణంలో తోడ్పాటునందించిన అందర్నీ ఆయన పదే పదే తలచుకునేవారు. తాను.. వారు మలిచిన మనిషినంటూ కృతజ్ఞతా భావాన్ని చాటుకునేవారు.

**అక్కడ గొంతెత్తి పాడితే.. సినిమావాళ్లు క్యూ కట్టారు**

అది నాంపల్లిలోని లలితకళా తోరణం. 'వర్తమానం' పత్రిక ప్రారంభోత్సవం జరుగుతోంది. గద్దర్ వరుసగా కొన్ని పాటలు పాడారు. ఆయనకు కాస్త విశ్రాంతినివ్వాలనే ఉద్దేశంతో ఎవరైనా వచ్చి పాటలు పాడాల్సిందిగా ఆహూతులను నిర్వాహకులు కోరారు. ఆ పిలుపుతో జనంలోంచి వేదికపైకి వచ్చిన అందెశ్రీ రెండు పాటలు పాడారు. అవి విన్న సినిమావాళ్లు పాటలు రాయాల్సిందిగా అందెశ్రీని వెతుక్కుంటూ వెళ్లారు. అనాథల జీవితం కథావస్తువుగా వచ్చిన 'మార్గదర్శి' సినిమా కోసం అందెశ్రీ తొలిసారిగా పాట రాశారు. ఆ తర్వాత వరుసగా 20 సినిమాలకు గీతాలు అందించారు. మోహన్‌బాబు 'అధిపతి' సినిమాలో 'ఆడ బతుకే పాడు బతుకని ఏడుస్తావెందుకే చెల్లెమ్మా..', ఆర్. నారాయణమూర్తి 'వేగు చుక్కలు' సినిమాలో 'కొమ్మచెక్కితే బొమ్మరా.. కలసి మొక్కితే అమ్మరా..' , 'జైబోలో తెలంగాణ' సినిమాలో 'జనజాతరలో మన గీతం' వంటి పాటలు అమితాదరణ పొందాయి. 'మాయమైపోతున్నాడమ్మా' పాటను 'ఎర్ర సముద్రం' సినిమాలో వాడారు. నిజామాబాద్‌లోని జోగిని వ్యవస్థను కళ్లారా చూసి చలించిన అందెశ్రీ 'ఒడిసే చెమట చుక్కల్లోనా రాలేపొద్దులు ఎన్నమ్మో...' అంటూ ఒక గేయం రాసుకున్నారు. అది చూసిన యలమంచలి శేఖర్.. కథగా మలచాల్సిందిగా సూచించారు. 'గంగ' పేరుతో ఆ చిత్రం నిర్మితమైతే అందులో అందెశ్రీ పాటలతో పాటు మాటలూ రాశారు. అదే చిత్రంలో 'ఎల్లిపోతున్నావా నా తల్లి'కి ఉత్తమ గేయరచయితగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. 'బతుకమ్మ' సినిమాకు పాటలు, మాటలు రాశారు.

**'జయ జయహే..'కు ఆ పాటే స్ఫూర్తి**

కామారెడ్డిలో 2002 సెప్టెంబరు 30న ధూంధాం వేదికమీదున్నప్పుడు 'జయజయహే తెలంగాణ' పాట రాయాలనే ఆలోచనకు బీజం పడిందని అందెశ్రీ ఓ సందర్భంలో చెప్పారు. కాకతీయ చరిత్ర, సంస్కృతి వైభవాన్ని వర్ణిస్తూ అంతకు మునుపు తాను రాసిన 'గలగల గజ్జల బండి చూడు...ఓరుగల్లు చూడు' అనే పాటే 'జయజయహే..'కు ప్రేరణ అని చెప్పారు. తొలిసారిగా ఈ గీతాన్ని సిద్దిపేటలో 2003 మార్చి2న జరిగిన తెలంగాణ రచయితల వేదిక వార్షికోత్సవంలో అందెశ్రీ ఆలపించారు. అది మొదలు ఆ పాట ప్రభంజనమై జనం మనస్సుల్లో శాశ్వతమైంది.

**అందెశ్రీ పాటకు మెచ్చి బంగారు కంకణం**

విద్యార్థిగా ఎన్నడూ పాఠశాల గుమ్మం తొక్కని అందెశ్రీ రాసిన 'జయజయహే తెలంగాణ' పాట ఇప్పుడు స్కూళ్లలో వినిపిస్తోంది. ఆయనే రాసిన 'మాయమైపోతున్నడమ్మా...' అనే గీతాన్ని డిగ్రీ విద్యార్థులకు ఓ పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆయన్ను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మైసూరులోని గణపతి సచ్చిదానందస్వామి అందెశ్రీ పాటకు మెచ్చి బంగారు కంకణంతో సత్కరించారు. అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డీసీ సంస్థ లోకకవి బిరుదు ప్రదానం చేసింది. గౌరవ డాక్టరేట్‌నూ అందించింది. దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ అవార్డు, సుద్దాల హనుమంతు - జానకమ్మ పురస్కారం, లోక్‌నాయక్ తదితర అవార్డులెన్నో అందెశ్రీని వరించాయి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు గాను అందెశ్రీకి రేవంత్ ప్రభుత్వం కోటి నగదు, ఇంటి స్థలం ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఆయన పేరును ప్రతిపాదించింది.

**'నదీకావ్యం' ఆలోచన చేసి..**

'ఒకేచోట కూర్చొని ఇరుకైపోతాననే భయంతో ఆరు ఖండాలను, ఏడు వింతలను చుట్టొచ్చాను' అని ఓ ఇంటర్వ్యూలో కవితాత్మకంగా చెప్పారు అందెశ్రీ. దేశవిదేశాల్లో పది నదుల పుట్టుక, ప్రవాహం, సంగమం గురించి అధ్యయనం చేశారు. ఆ యాత్రా విశేషాలు 'ఆంధ్రజ్యోతి ఆదివారం'లో ప్రచురితమయ్యాయి. ఆ నదుల విశేషాలను 'నదీ కావ్యం' పేరుతో అక్షరీకరించే ప్రయత్నంలో ఉన్నట్టు ఓ సందర్భంగా చెప్పారు. తన ఆత్మకథ కూడా అక్షరబబద్ధం చేసే ప్రయత్నంలో ఉన్నానని వెల్లడించారు. వాక్కులమ్మ ప్రచురణలు ద్వారా తన సంపాదకత్వంలో తెలంగాణ ఉద్యమ పాట 'నిప్పులవాగు' సంకలనాన్ని తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని శ్రామిక మహిళలతో ఆవిష్కరింపచేశారు. బుద్ధుని జీవితం మీద 'స్వర్ణహంస'తో పాటు మరికొన్ని పుస్తకాలు తేవాలన్న ఆలోచనతో ఉన్నారు. ఇంతలోనే అందరినీ వదిలి వెళ్లారు.





# తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, నవంబర్ 10**
ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" రచించిన అందెశ్రీ మరణం, రాష్ట్ర సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల హృదయాలను తాకి, విప్లవ జ్వాలను రగిలించిన జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది మంది గొంతుకగా నిలిచిందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధనలో ప్రజలకు చైతన్యం నింపడంలో అందెశ్రీ కవిత్వం ప్రత్యేక పాత్ర పోషించిందని కొనియాడారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని కూడా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర గీతానికి కొత్త స్వర రూపకల్పనలో ఆయనతో పంచుకున్న ఆలోచనలు, సహకారం తనకు ప్రత్యేకమైన అనుభూతి కలిగించిందని తెలిపారు. "తెలంగాణ సాహితీ శిఖరం కూలిపోయిన భావన కలుగుతోంది. స్వరాష్ట్ర సాధనలో, జాతి చైతన్యంలో అందెశ్రీ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి" అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన రేవంత్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అందెశ్రీ మరణంపై మంత్రి సీతక్క సంతాపం



**హైదరాబాద్, నవంబర్ 10:** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజా సాహిత్యానికి, స్వరాష్ట్ర ఉద్యమానికి అందెశ్రీ అందించిన సేవలు అపూర్వమని ఆమె పేర్కొన్నారు. అందెశ్రీ రచనలు, గీతాలు తెలంగాణ ఉద్యమ రోజుల్లో ప్రజల్లో చైతన్యం నింపి, స్వరాష్ట్ర సాధనకు దారితీశాయని మంత్రి గుర్తుచేశారు. "జయ జయహే తెలంగాణ" గీతం ఇవాళ రాష్ట్ర గీతంగా ప్రతి తెలంగాణ బిడ్డ గర్వంతో ఆలపిస్తున్నదని చెప్పారు. తెలంగాణ ఉన్నంత వరకూ అందెశ్రీ అందించిన చైతన్యం సజీవంగానే ఉంటుందని పేర్కొన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# అందెశ్రీ పార్థివదేహానికి కేటీఆర్ నివాళి

**- కేటీఆర్ తో పాటు బీఆర్ఎస్ నేతల శ్రద్ధాంజలి**

**- అందెశ్రీ రచనలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయి : కేటీఆర్ - కుటుంబ సభ్యులకు సానుభూతి**

**హైదరాబాద్, నవంబర్ 10**
తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ కవి అందెశ్రీ పార్థివ దేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పలువురు నేతలు హాజరై శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందెశ్రీ గారి సేవలు, రచనలు, పాటలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భావజాలాన్ని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపిన గొప్ప కవి నష్టపోవడం సమాజానికి, సాహిత్యానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ గారి రచనలు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని, ఆయన మాటల్లో తెలంగాణ ఆత్మ ఉందని కేటీఆర్ భావోద్వేగంగా అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు



శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## అందెశ్రీతో సమావేశ ఫోటోలు
# షేర్ చేసిన సీఎం రేవంత్

**- మరణం పట్ల వ్యక్తపరచిన తీవ్ర దిగ్భాంతి**

**హైదరాబాద్, నవంబర్ 10:** తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ"కు సంగీత స్వరాల ప్రస్థానంలో కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తుచేసుకుంటూ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాఢమైన బాధ వ్యక్తం చేశారు. ఈ మేరకు సమావేశ సమయంలో తీసిన పలు ఫోటోలను సీఎం తన సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ, హృదయాన్ని హత్తుకునే సందేశాన్ని పోస్ట్ చేశారు. ఇటీవల రాష్ట్ర గీతాన్ని అధికారిక గీతంగా ప్రకటించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో%ా% సంగీత రూపకల్పన, తుది మౌలిక నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన బృందంతో జరిగిన చర్చల్లో అందెశ్రీ పాల్గొన్న విషయం తెలిసిందే. ఆ సమావేశాల్లో అందెశ్రీ ఉత్సాహంగా, చిరునవ్వులతో, భావోద్వేగంతో పాల్గొన్న దృశ్యాలు ఈ పోస్ట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే గీతానికి స్వరాన్నివ్వడానికి సాగిన చర్చలు ముగిసి ఎంతో కొద్ది గంటల్లోనే అందెశ్రీ అకాల మరణం సంభవించడం విధి విరుద్ధమని రేవంత్ పేర్కొన్నారు. "తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించే గీతానికి ఆయన అందించిన పదాలు, భావం, ఆత్మాభిమాన జ్యోతి%-%ఎప్పటికీ చావదు" అని సీఎం తెలిపారు. అందెశ్రీతో గడిపిన ఆ అరుదైన క్షణాలు ఇప్పుడు అమూల్యమైన జ్ఞాపకాలుగా మారిపోయాయని వేదన వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం రాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక రంగానికి తీరని లోటని పేర్కొన్న సీఎం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో అందెశ్రీ అమరుడిగా నిలిచిపోతారని భావోద్వేగపూర్వకంగా అన్నారు.

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

**- మత పెద్దల ప్రార్థనల మధ్య అధీక్ష బాధ్యతలు చేపట్టిన అజారు**

**- సీఎంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటా -మంత్రి అజారుద్దీన్ హామీ**

**- మైనార్టీ సంక్షేమం-పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల్లో సంస్కరణలకు సంకల్పం**





**హైదరాబాద్, నవంబర్ 10**
తెలంగాణ రాజకీయాల్లో కొత్త శకం ఆరంభమైందని చెప్పేలా, టీమిండియా మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ సోమవారం మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌కి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి చేరుకున్న అజారుద్దీన్, ముస్లిం మత పెద్దల ప్రార్థనల అనంతరం 'బిస్మిల్లాహ్'తో అధికారి బాధ్యతల పత్రాలపై సంతకం చేశారు. ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ నేతలు, సచివాలయ సిబ్బంది హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, "నా మీద ఎంతో నమ్మకం ఉంచి ఈ అత్యంత కీలకమైన రెండు శాఖలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు. సీఎం ఆశించిన విధంగా, నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తాను. తెలంగాణ మైనార్టీల సాధికారత, సంక్షేమానికి, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడానికి కృషి చేస్తాను" అని స్పష్టం చేశారు. తన శాఖల్లో పారదర్శకత, స్పష్టమైన విధానాలు, నూతన ఆవిష్కరణలు, వినూత్న కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. అజారుద్దీన్ బాధ్యతలు స్వీకరించడం పట్ల సచివాలయం సందడిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు వరుసగా ఆయనను అభినందించారు. మైనార్టీల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మహిళలు మరియు యువతకు అవకాశాల కల్పనలో అజారుద్దీన్ ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన సమీప వర్గాలు సూచిస్తున్నాయి. అదే విధంగా, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలో నష్టాల్లో ఉన్న సంస్థలను పునరుద్ధరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రజల కోసం మరింత సమర్థవంతంగా నడపడం, ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. గమనించదగ్గ విషయమేమిటంటే, గత నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయన చేత ప్రమాణం చేయించి, నవంబర్ 4న సీఎం రేవంత్ రెడ్డి శాఖలను కేటాయించారు. తెలంగాణ క్రీడా రంగంలో అజారుద్దీన్ ప్రతిష్ట, జాతీయ స్థాయి గుర్తింపు దృష్ట్యా, ఆయన మంత్రిగా ప్రవేశించడంపై ప్రజల్లో కూడా మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పుడు అధికారికంగా బాధ్యతలు చేపట్టడంతో, రెండు శాఖల్లో త్వరలోనే చర్యలు, మార్పులు, కొత్త విధానాలు అమలవుతాయనే అంచనాలు పెరుగుతున్నాయి. అధికార వర్గాల అభిప్రాయం ప్రకారం, అజారుద్దీన్ జాతీయ ఖ్యాతి, ప్రజలతో అనుసంధానం, పరిపాలనా తీరు మైనార్టీ సంక్షేమ రంగంలో నూతన మార్పులకు దోహదం చేసే అవకాశం ఉంది. సచివాలయంతో పాటు, ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు ఫీల్డ్ విజిట్లు కూడా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.



# హైడ్రాకు ప్రజల అండ

**నగర అభివృద్ధిలో కొత్త విశ్వాసం**

**- ప్రజల మద్దతుకు హైడ్రా ధన్యవాదాలు**

**- చట్ట గౌరవంతో ముందుకు హైడ్రా**

**- వరద నియంత్రణ-చెరువుల పునరుద్ధరణ ఫలితాలు**

**హైదరాబాద్, నవంబర్ 10**
హైడ్రా కార్యక్రమాలకు నగర ప్రజలు తెలియజేస్తున్న విస్తృత మద్దతుపై హైడ్రా కృతజ్ఞతలు తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ర్యాలీల ద్వారా ఖండించడంతో సంస్థ హర్షం వ్యక్తం చేసింది. "మీరిచ్చిన స్ఫూర్తి మాకు మరింత ఉత్సాహం నింపింది" అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రఘునాథ్ స్పందించారు. పర్యావరణ హిత నగర నిర్మాణం లక్ష్యంగా, ప్రభుత్వం సూచించిన దిశగా హైడ్రా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. చట్టాల పట్ల గౌరవంతో, రాజ్యాంగ స్ఫూర్తితో హైడ్రా పని చేస్తోందని కమిషనర్ తెలిపారు.ఽ

పేదలను కవచంగా ఉపయోగించి బడా బాబులు కబ్జాలు చేసుకునే వ్యవస్థను వెలికితీస్తున్నామని, ఇదే కారణంగా హైడ్రాపై 700, తనపై 31 కంటెంప్ట్ కేసులు పెట్టారని పేర్కొన్నారు. 2024 జూలైకి ముందు నివాసం ఉన్న వారి ఇళ్లపై హైడ్రాకు ఎలాంటి ఉద్దేశం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలు తీసుకోవాల్సి వస్తే ప్రత్యామ్నాయం-పరిహారం కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. హైడ్రా ఏర్పాటు నుంచి నేటివరకు మొత్తం 181 డ్రైవ్‌లు నిర్వహించి 954 కబ్జాలను తొలగించినట్టు కమిషనర్ వెల్లడించారు. దీంతో 1,045.12 ఎకరాల ప్రజా%-%ప్రభుత్వ భూములను కాపాడారని, వీటి అంచనా విలువ రూ.50,000%-%55,000 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువులు, పార్కులపై చేపట్టిన ఈ చర్యల ఫలితంగా నగరంలో వరద ప్రమాదాన్ని పెద్దఎత్తున తగ్గించగలిగామని అన్నారు. వర్షాకాలానికి ముందుగానే చేపట్టిన నాళాల క్లీనింగ్, క్యాచ్‌పిట్ క్లీరెన్స్ వంటి 96,972 పనులు ఈ ఏడాది వరద ప్రభావాన్ని తగ్గించాయని వివరించారు. నగర చెరువుల పునరుద్ధరణపై కూడా హైడ్రా దృష్టి సారించింది. తొలి విడతలో చేపట్టిన బతుకమ్మకుంటతో పాటు తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు, పాతబస్తీ బంరుక్‌ఉద్దౌలా చెరువులు త్వరలో ప్రజల వినియోగానికి సిద్ధం కాబోతున్నాయి. చెరువులపై జరుగుతున్న ఆక్రమణలను తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పలు కాలనీల వరద ముప్పు తొలగిందని, మరిన్ని చెరువులను ప్రాధాన్యంగా అభివృద్ధి చేయనున్నట్టు కమిషనర్ ప్రకటించారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146



# తెలంగాణ

# సాహితి "అందే "నింగికెగసింది

## కవి కళాకారుడు తెలంగాణ ఉద్యమకారుడు

## "అందే శ్రీ" మరణం తీరని లోటు

## ప్రధానిమోడీ , ముఖ్యమంత్రి రేవంత్

## రాజకీయ సీని ప్రముఖుల సంతాపం



జయజయహే తెలంగాణ జనని జయకేతనం అంటూ తెలంగాణ తల్లిని 4 కోట్ల ప్రజలు గొంతుకై కదిలిన కవి , జన జాతరలో మన గీతం జయకేతనమై ఎగరాలి అంటూ ఉద్యమ పాలను రంగరించి పోసిన ధీరత్వ కవి, మాయమై పోతున్నడమ్మా మనిషి అన్నవాడు అంటూ మానవత్వ పరిమళాలను వెదజల్లిన మట్టి మనిషి తెలంగాణ కవి సాహితి పిపాసి ప్రముఖ కవి, గేయ రచయిత అందెశ్రీ (64) ఇక లేరు సోమవారం ఉదయం హఠాన్మరణం చెందారు. హైదరాబాద్ తార్నాక డివిజన్ లాలా పేటలో నివాసం ఉంటున్న ఆయన తెల్లవారుజామున ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపడిపోగా కుటుంబ సభ్యులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఉదయం 7:25 గంటలకు ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో తెలం గాణ సాహితీ లోకం ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపో యింది. 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని రేబర్తి గ్రామంలో జన్మించిన ఆయన అసలు పేరు ఎల్లయ్య. ఆయనకు ముగ్గురు కుమార్తెలు.. ఓ కుమారుడు ఉన్నారు. అందెశ్రీ హఠాన్మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణంతో తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సంతాపం ప్రక టించారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరి పేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆయన మరణం పట్ల ప్రధాని మోడీ ,ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం కేసీఆర్ సహా మంత్రులు, రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, సాహితీ, సినీ ప్రముఖులు అందెశ్రీ మరణం పట్ల సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రి యలు నేడు మేడ్చల్ జిల్లా ఘట్కేసర్లో జరగనున్నాయి.


సినీ, సాహితీ ప్రస్థానం..

గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన భవన నిర్మాణ కార్మికుడిగా కూడా పని చేశారు. పాఠశాల చదువు లేకుండానే మేటి రచయితగా రాణించారు.సమాజాజీవన శైలి లోనే తన రచనలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' ఆయన రాసిందే. 'మాయమైపోతున్నడమ్మా' పాటతో ప్రజల్లో విశేషమైన పేరును సంపాదించుకున్నారు. ఆశువు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. సినీ రంగానికి సైతం ఆయన సేవలందించారు. 2006లో 'గంగ' సినిమాకు గాను అందెశ్రీకి నంది పురస్కారం లభించింది. 2014లో అకాడమీ ఆఫ్ యూనివ ర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, 2015లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్నాయక్ పురస్కారంతోపాటు కాకతీయ యూనివర్సిటీ నుంచి అందెశ్రీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.











# 10 క్వింట ల నల్ల బెల్లం,50 కిలోల పట్టిక,40లీటర్ల నాటు సారాయి స్వాధీనం.

## 2 మోటారు సైకిళ్ళు సీజ్

## ఎస్సై కే.క్రాంతి కిరణ్

తొవ్వ ,కేసముద్రం,నవంబర్ 10, :క్వింటాళ్ళ నల్లబెల్లం,50 కిలోల పట్టిక,40 లీటర్ల నటు సారాయి స్వాదీనం ఇద్దరు వ్యక్తుల పైన కేసు నమోదు చేసి బెల్లాన్ని తరలిస్తున్న రెండు మోటార్ సైకిల్ లను సీజ్ చేసిన కేసముద్రం ఎస్సై,కె.క్రాంతి కిరణ్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూర్ నుండి నల్లబెల్లం,పట్టికలను తెచ్చి ఒక దగ్గర డంప్ చేసి కేసముద్రం పరిది లోని ముత్యలమ్మ తండా , తవుర్య తండా లలో అమ్ము తున్నరనే నమ్మదగిన సమాచారం తో కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్ తన సిబ్బందితో కలసి రాత్రి పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తూ ముత్యాలమ్మతండా శివారులో నల్లబెల్లం, పట్టిక, నాటు సార ను తరలిస్తున్న మాలోతు అశోక్ (28 ), కేసముద్రం మండలం కి చెందిన గుగులోతు సురేష్ (24 )తావుర్య తండా గ్రామం, కేసముద్రం మండలం లను పట్టుకుని వారిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.నల్ల బెల్లం, పట్టిక , నాటుసారాను తరలిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాదీన పరచుకున్న నల్లబెల్లం, పట్టిక, నాటుసారా విలువ రూ. 1,20,000 ఉంటుందని తెలిపారు.ఇకమీదట ఎవరైనా నల్ల బెల్లం, పట్టిక నాటు సార ల వ్యాపారం చేస్తే వారిపైన కఠిమైనా చర్యలు తీసుకుంటామని ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఎస్ ఐ కే క్రాంసీఐతి కిరణ్ , రెండవ ఎస్సై పి నరేష్, పోలీస్ సిబ్బందిని సీఐ సత్యనారాయణ అభినందించారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల ఆకస్మిక తనిఖీ

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవి రాథోడ్



కేసముద్రం,నవంబర్ 10,తొవ్వ:జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆధ్వర్యం లో సోమవారం మహబూబాబాద్ లోని కీర్తి ప్రైవేట్ ఆసుపత్రి,కేసముద్రం లోని శ్రీ శ్రీనివాస ఆసుపత్రుల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ...క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రులు, యునాని, ఆయుర్వేద , యోగ, ఫిజియోథెరపీ సెంటర్ లు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని,కన్సల్టింగ్ డాక్టర్ వివరాలు,వారి సర్టిఫికెట్ లు అందుబాటులో ఉండాలని, వారు అందించే సేవలకు తీసుకునే రుసుముల ధరల పట్టిక అందరికీ కనిపించే విధం గా ప్రదర్శించాలని, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు ఆడ మగ అని చెప్పినచో చట్టరీత్య చర్యలు తీసుకోబడునని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.సారంగం,డిప్యూటీ మాస్ మీడియా అధికారి కే.ప్రసాద్, కె. వి.రాజు హెల్త్ ఎడ్యుకేటర్,లోక్య హెచ్ఈఓ, మనోహర్ ఎల్ డి కంప్యూటర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్మా జిల్లా స్థాయి కోకో పోటీలలో శ్రీ వివేకవర్ధిని విద్యార్థులుకు ప్రథమ స్థానం



,తొవ్వ ,కేసముద్రం,నవంబర్ 10,:ట్రస్మా మహబూబాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరచారు.జమాన్ల పల్లి లోని విద్యా భారతి గురుకుల విద్యాలయంలో ఈనెల 8,9 తేదీలలో నిర్వహించిన పోటీల్లో కోకో విభాగంలో పాల్గొన్న విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు.ఈ విజయంపై పాఠశాల కరస్పాండెంట్ గౌడ్ విద్యార్థులను,పిఈటిని అభినందిస్తూ వారి కృషి,క్రమశిక్షణ వల్లే ఈ విజయాన్ని సాధించగలిగారు అని తెలిపారు.అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై దీపిక విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు,ట్రస్మా బాధ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు



తొవ్వ, దంతాలపల్లి, నవంబర్. 10

ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్న ఘటన దంతాలపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం దంతాలపల్లి శివారు రాజస్థాన్ దాబా హోటల్ వద్ద దంతాలపల్లి పోలీసులు జిల్లా సివిల్ సప్లై అధికారులు కలిసి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో సుమారు 200 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వారు వెల్లడించారు. ఖమ్మం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే విరమించుకోవాలి: సిఐటియు



**యాదాద్రి జిల్లా రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 10:**

మధ్యాహ్న భోజన పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని కొడంగల్ నియోజకవర్గంలో అక్షయపాత్రకు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. సోమవారం రోజున సెంట్రలైజ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు కి వినతి పత్రం అందజేశారు .ఈ సందర్బంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వంట కార్మికులుగా గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వీరికి సరైన జీతాలు గాని ఇతర సౌకర్యాలు ఏమి కల్పించకుండా ప్రభుత్వము శ్రమ దోపిడీ చేస్తున్నాదని, నేటి ప్రభుత్వము సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో అక్షయపాత్ర వారికి కోడంగల్ లో ఈ నెల 14న ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నారు అలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని నేడు రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ కలెక్టర్ల కి వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలో 54, 200 మంది వంట కార్మికులుగా పనిచేస్తున్నారని, వీరి ఉపాధి పోయే ప్రమాదము ఉన్నది కావున ప్రభుత్వము సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎప్పటికప్పుడు పిల్లలకు వేడివేడి భోజనం అందించాలని చెప్పినా, ప్రభుత్వం పట్టించుకోకుండా కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ప్రైవేట్ వాళ్లకు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తుదని, కావున అలాంటి ప్రయత్నము విరమింపజేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ఈనెల 24 నవంబర్ న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని, కార్మికులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే విధంగా తరలిరావాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల 5వ తేదీ లోపల బిల్లులు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాగుల వసంత, జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, నాయకులు శ్యామ్, పారిజాత, స్వేత,పుష్ప, పూర్ణమా, రమ, వరలక్ష్మి, వరమ్మ, రూప, లక్ష్మి, కౌశల్య, స, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కోకో పోటీలలో శ్రీ వివేకవర్ధిని విద్యార్థులకు ప్రథమ స్థానం



**తొవ్వ ,కేసముద్రం,నవంబర్ 10:**

ట్రస్మా మహబూబాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచారు. జమాండ్లపల్లిలోని విద్యా భారతి గురుకుల విద్యాలయంలో ఈనెల 8, 9 తేదీలలో నిర్వహించిన పోటీల్లో కోకో విభాగంలో పాల్గొన్న విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు.ఈ విజయంపై పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ విద్యార్థులను, పిఈటిని అభినందిస్తూ, వారి కృషి, క్రమశిక్షణ వల్లే ఈ విజయాన్ని సాధించగలిఅని తెలిపారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై దీపిక విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, బాధ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# కో కో పోటీల్లో సత్తా చాటిన షైనాజ్, సనా

## ప్రైవేట్ పాఠశాలల మధ్య పోటాపోటీ ..



**తొవ్వ, నర్సింహులపేట,నవంబర్10**

జిల్లా స్థాయి అండర్ 14,17 కోకో పోటీల్లో దంతాలపెల్లి మండల కేంద్రంలో ఉన్న అక్షర హైస్కూలు పాఠశాల క్రీడాకారులు రెండవ బహుమతి గెలుచుకుని సత్తా చాటారు.ఈనెల 08వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ప్రైవేట్ పాఠశాలల కోకో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నర్సింహులపేట గ్రామానికి చెందిన పోలీస్ హెూం గార్డు నయీంపాషా కూతుర్లు షైనాజ్, సనా ఇద్దరూ పాల్గొన్నారు. ఈ జట్టుకు కోకో కెప్టెన్ గా షైనాజ్ వ్యవహరించడం విశేషం కాగా.. అటు అక్షర హైస్కూల్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థులతో పాటు నర్సింహులపేట మండల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ షైనాజ్,సనా లను అభినందించి ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నారు.ఈసందర్భంగా షైనాజ్,సనా మాట్లాడుతూ.. మమ్ములను ప్రోత్సహించిన యాజమాన్యానికి, వ్యాయామ కోచ్ అనిల్ కు ధన్యవాదాలు

# అందెశ్రీ కి ఘన నివాళులు



**యాదాద్రి జిల్లా రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 10:**

ప్రముఖ కవి, గేయ రచయిత తెలంగాణ రాష్ట్రీయ గీతం జయ జయహే తెలంగాణ సృష్టికర్త అందెశ్రీ కీ రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం సామాజిక కార్యకర్త నోముల యాదగిరి మాట్లాడుతూ 1961 జులై నెల 18 వ తేదీన వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో అందెశ్రీ జన్మించారు. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో తెలంగాణ సమాజాన్ని తట్టి లేపిన అందెశ్రీ, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించి, తెలంగాణ ప్రజలకు అందించారు. తెలంగాణ గేయం కోట్లాదిమంది ప్రజలను తట్టిలేపింది తన రచనలలో మరో అద్భుతమైన పాట వారు మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు అని మానవ సంబంధాలను గుర్తు చేస్తూ ఇలాంటి ఎన్నో అద్భుతమైన పాటలు రచించారు. ఆయన మరణం తెలంగాణ ప్రజలకు తీరని లోటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చల్ల సత్య ప్రకాష్, నాగటి మహేష్, చిప్పలపల్లి రామచంద్రం, సుర్వి రాకేష్, నోముల సైదులు, మానుపాటి రాములు, నోముల శంకర్, సుర్వి వెంకన్న, చిప్పలపల్లి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

తొవ్వ ప్రాంతీయం , జాతీయం WWW.THOVVA NEWS.COM

# నూతన దంపతులు తేజస్వి, తేజా నాయక్ లు సుఖసంతోషాలతో వర్ధిలాలి

## ఆశీర్వదించిన బీఆర్ఎస్ పార్టీ మండల నేతలు

తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 10



మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ –సీతామహాలక్ష్మి గార్ల కుమార్తె తేజస్వి–తేజ నాయక్ దాంపత్య జీవితం నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో నిలసిల్లాలని బారాస మండల అధ్యక్షులు పరిపాటి వెంకటరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గుండా వెంకన్న, ఆర్ఎస్ఎస్ మాజీ మండల కోఆర్డినేటర్ కాసం వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు బత్తిని అనిల్ గౌడ్ లు మండల నేతలతో కలిసి ఆశీర్వదించారు. సోమవారం జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ లోని పి ఎస్ ఆర్ కన్వెన్షన్లో నిర్వహించిన వివాహ రిసెప్షన్ కార్యక్రమం లో బారసాశ్రేణులు, పాల్గొని నూతన దంపతులకు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆశీర్వదించిన వారిలో సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు బానోత్ భీముడు శ్రీరామగిరి పిఎసిఎస్. వైస్ చైర్మన్ బానోత్ బొజ్యా నాయక్. మండల మాజీ యూత్ అధ్యక్షుడు మంద అశోక్. మండల సోషల్ మీడియా ఇంచార్జీ ఎడ్ల మహేష్. మండల యూత్ ఉపాధ్యక్షులు కారం ప్రశాంత్ , మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాకు బయలుదేరిన గీతపనివారల సంఘం

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :నవంబర్ 10:**



రాష్ట్రవ్యాప్త గీతపనివారల సమస్యలైన 13 కోట్ల ఎక్స్ గ్రేషియోలను, వృత్తి రిత్యా 50ఏండ్లు నిండిన గీతపనివారల కు ఫించన్లు వెంటనే మంజూరు చేయాలని, 560 జీవో ప్రకారం 5 నుండి 10 ఎకరాల భూమిని గీత సొసైటీలకు ఇవ్వాలని, అనేక రకాలైన సమస్యలను పరిష్కరించాలని,ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సోమవారం భువనగిరిలో జరిగే కలెక్టరేట్ ముందు ధర్నాకు రామన్నపేట మండల గీతపనివారల సంఘం మండల కమిటీ నాయకులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గీతపనివారల మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, కొమ్మాయిగూడెం గీతపనివారల నాయకులు బాలగోని నర్సింహ్మ, ఎర్ర నర్సింహ్మ, వీరమళ్ళ ముత్తయ్య, గంగాపురం సైదులు, కూనూరు నర్సింహ్మ, భూపతి నర్సింహ్మ, బత్తుల సత్తయ్య,నోముల వెంకటేష్, చెరుకు శివరాజ్, ఎర్ర బిక్షపతి, ఎర్ర సత్తయ్య, గంగాపురం యాదగిరి, గిరుకల ఢిల్లిబాబు, వీరమల్ల శేఖర్, గోపగోని గోపాల్, నోముల గోపాల్, చెరుకు లక్ష్మయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు..

# రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లులు

## బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం


యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :నవంబర్ 10



రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాట్లాడుతూ నిన్న మునిపంపుల గ్రామంలో రైతుల ధాన్యం లారీలను నాగారం వాసవి రైస్ మిల్ వద్ద ఖాళీ చేయడానికి వెళ్ళగా రైస్ మిల్లు వారు ఖాళీ చేసుకోవడం లేదు. రైతులు అధికారులకు తెలియజేయగా మండల అగ్రికల్చర్ అధికారులు రైస్ మిల్ వద్దకు వెళ్లి లారీ లోడును దిగుమతి చేసుకోవాలని మిల్లు యజమానికి తెలపగా మిల్లు యజమాని లారీలో ధాన్యంలో తాలు ఉన్నదని ముక్క పాయ ఉన్నదని ఆ ముక్క పాయ వల్ల ఆరు నెలల తర్వాత మా యొక్క రైస్ మిల్లులకు నష్టం జరుగుతుందని మేము దించుకోమని కరాకండిగా తెలియజేశారు. రైతులు దించుకోవాలని రైస్ మిల్పై ఒత్తిడి చేయగా రైస్ మిల్లు వారు ఒక్క లారీ ధాన్యం లోడుకు పది క్వింటాళ్లు కట్ చేసుకుని దించుకోవడం జరిగింది. దీనితో గ్రామానికి చెందిన రైతులు బీసీ యాదయ్య, కూనూరు లింగస్వామి, గాది కృష్ణ, పావిరాల నరేష్ ,కంబాలపల్లి కిరణ్ ,రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బండ రంగారెడ్డి, ఏసబోయిన భిక్షం, కొసని అంజయ్య, నక్క సత్తయ్య, నల్ల సైదులు ,కరెంకొండ గోవర్ధన్, అక్కెనపల్లి మల్లయ్య, వంగాల సంపత్, గట్టు శేఖర్, రేముడాల వెంకన్న, వంగాల బాబు, వంగాల సాయి, మెడబోయిన నరేష్ ,గట్టు బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# అందెశ్రీ మరణం రాష్టానికి తీరని లోటు.

## -సూరం సుధాకర్ రెడ్డి.



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 10.**

రచయిత అందెశ్రీ హఠాన్మరణం తెలంగాణ సాహిత్య లోకాన్ని విషాదం లోకి నెట్టింది.ఆయన మృతిపై సూరం సుధాకర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రముఖ కవి,జయ జయహే తెలంగాణ ఉద్యమ గీత రచయిత డాక్టర్ అందెశ్రీ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందనీ తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమం, సాంస్కృతిక పోరాటంలో ఆయన పోషించిన పాత్ర సదా చిరస్మరణీయం.ఈ విషాద సమయంలో వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని సుధాకర్ రెడ్డి అన్నారు.అలాగే వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

# లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి.

## -ఎస్ఐ తిరుపతి.



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 10.**

ఈనెల 15న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను మండలానికి చెందిన కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బయ్యారం మండల ఎస్ఐ తిరుపతి సూచించారు.క్రిమినల్ కంపౌండబుల్, సివిల్,ఆతగాదాలు,కుటుంబపరమైన,వైవాహిక జీవితానికి సంబంధించిన రాజీ పడదగిన కేసుల్లో పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని ఎస్ఐ తెలిపారు.ఇరు వర్గీయులు రాజీపడటంతో సమస్య పరిష్కారం కావడమే కాకుండా,కక్షిదారుల విలువైన సమయం,డబ్బు ఆదా అవుతాయని ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతి అన్నారు.

# కొమ్ములవంచలో కత్తిపోట్ల కలకలం..!!

**తొవ్వ ,నర్సింహులపేట ,నవంబర్ 09:**



కొడుకును పొడుస్తున్నాడని అడ్డుకోబోతే తల్లిని కూడా కత్తితో పొడిచిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామంలో కలకలం రేపింది..



స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన బూరుగండ్ల రవి అదే గ్రామానికి పారునంది అర్జున్ లకు జరిగిన ఘర్షణ నేపథ్యంలో రవి కత్తితో అర్జున్ ను పొడుస్తుండగా..., అడ్డుకోబోయిన తల్లి సునీతను కూడా చేయి దగ్గర పొడిచాడు.. తీవ్ర గాయాలతో, బాధితులైన తల్లి,కొడుకులు ఇద్దరూ నర్సింహులపేట పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదుకు వచ్చారు. స్థానిక ఎస్ఐ సురేష్ వెంటనే 108 అంబులెన్స్ పిలిపించి జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఘర్షణ చోటు చేసుకోవడానికి, కత్తిపోట్లకు వ్యక్తిగత పాతకక్షలే కారణమని గ్రామస్తులు అంటున్నారు.

# బాల్య వివాహాల చట్టం పై అవగాహనా కార్యక్రమం

**తొవ్వ,ప్రతినిధి , నవంబర్ 09:**







మహబూబాబాద్ జిల్లా, చిన్నగూడూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం"జిల్లా మహిళా సాధికారత కేంద్రం" ఆధ్వర్యంలో "బేటి బచావో" "బేటి పడావో" బాల్య వివాహాల చట్టం పై అవగాహన కార్యక్రమన్నీ సోమవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ మహేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడము వల్ల జరిగే అనర్ధాల గురించి వివరించారు . పిల్లల అక్రమ రవాణా గురించి తెలియ జేశారు , హెల్ప్ లైన్ నంబర్స్ 1098,181,100,1930 గూర్చి చెప్పారు . ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లలిత గారు, సీనియర్ జర్నలిస్ట్,జంపాల,చక్రధర్,చిన్నగూడూరు పోలీస్ అధికారులు, శ్రీనివాస్ ,సందీప్,శ్రీకాంత్,నాగమల్లు,చైల్డ్ లైన్ అనిల్ ,( షేర్ ఎన్జీవో) కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, (జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్స్ ఫౌండేషన్) (%యిబర్ తీఅస్త్రష్ట్ర టశీతీ ఎష్ట్రఱశ్రీసతీవఅ టశీబఅఝ్ఱశీఅ%) నుండి,చిత్తారి,సోమన్న, అరుణ సంధ్యరాణి మహిళా సాధికారత సిబ్బంది మరియు ఇతర ఉపాధ్యాయునులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2025 బ్రోచర్ ఆవిష్కరణ

**హైదరాబాద్,నవంబర్ 10:**

కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) న్యూ ఢిల్లీ లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2025 బ్రోచర్ ను కేఐఓ అండ్ సీకేఎఫ్ అధ్యక్షులు, ఏకేఎఫ్ ఈసీ సభ్యులు మరియు 8వ డాన్ బ్లాక్ బెల్ట్ హన్షీ భారత్ శర్మ ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా హన్షీ భారత్ శర్మ మాట్లాడుతూ...ఈ ఛాంపియన్షిప్ ను సీకోకై కరాటే తెలంగాణ సంస్థ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ తో కలిసి నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అనుమతితో జరుగుతుంది. ఇది వర్ల్డ్ కరాటే ఫెడరేషన్ (డబ్ల్యూకేఎఫ్) కు అనుబంధంగా ఉంది. "హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ యువ కరాటే క్రీడాకారులకు తమ నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రదర్శించే అద్భుతమైన వేదికగా నిలుస్తుంది అన్నారు. దేశ వ్యాప్తంగా కరాటే కళ స్ఫూర్తిని మరింత పెంచడమే తమ లక్ష్యం అని తెలిపారు.మాస్టర్ టి. కనక రాజు (డబ్ల్యూకెఎఫ్ అండ్ ఏకెఎఫ్ జడ్జ్, సీకో అధికారిక ఇన్స్ట్రక్టర్, తెలంగాణ),మాస్టర్ జే. ప్రవీణ్ కుమార్ (ఏకెఎఫ్ జడ్జ్ అండ్ డబ్ల్యూకెఎఫ్ కోచ్) లతో పాటు ఈ కార్యక్రమంలో టీ పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ , కేఐఓ జాయింట్ సెక్రటరీ కీర్తన్ కొండ్రు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు

